


కాకినాడ ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36 (బుధవారం)
కనిష్ఠం : 26

మంత్రి దుర్గేష్‌కు సీఎం అభినందన

నిడదవోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) :వియత్నాంలో జరిగే బుద్ధ భగవానుడి అవశేషాల ప్రదర్శన కార్యక్రమ నిర్వ హణ బాధ్యతను కేంద్ర మైనార్టీ వ్యవహారాల శాఖా మంత్రి కిరణ్ రిజ్జు,రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్‌లకు అప్పగిస్తూ పీఎంవో కార్యాలయం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం సీఎం నారా చంద్రబాబు నాయుడు అమరావతిలో మంత్రి దుర్గేష్‌ను అభినందించారు. వియత్నాంలో జరిగే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి దేశానికి,రాష్ట్రానికి పేరు తీసుకురావా లంటూ సూచించారని మంత్రి కందుల దుర్గేష్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. ఈ మేరకు రాజమహేంద్ర వరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టు నుంచి బుధ వారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు.అక్కడ నుంచి వియత్నాం వెళ్లనున్నారు. గురువారం నుంచి మే 6వ తేదీ వరకు జరిగే బుద్ధ భగవానుడి అవశేష ప్రదర్శన కార్యక్రమ నిర్వహణ చేయనున్నారు. మంత్రి దుర్గేష్ కు మధురపూడి విమానాశ్రయంలో జనసైనికులు ఘనంగా వీడ్కోలు పలికారు.



స్వగ్రామం మాచవరంలో రోదిస్తున్న కుటుంబీకులు

పత్తి దుర్గాస్వామి(ఫైల్) ఈశ్వర శేషారావు(ఫైల్)

మేమెలా బతికేది..
దేవుడా!
సింహాచలం ఘటనలో ఇద్దరు కోనసీమ వాసుల మృతి

- రెండు కుటుంబాల్లో విషాదం
- కన్నీరుమున్నీరైన కుటుంబీకులు
- మాచవరంలో విషాదఛాయలు
- అండగా జనసేన : పవన్

అంబాజీపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ఎంత పనిచేశావ్ దేవుడా.. నిన్నుచూద్దామని వస్తే..నీ దగ్గరకే తీసుకుపోయావా.ఎలా బతికేది అంటూ కన్నీటిపర్యంతమయ్యారు. నాన్నా లేవరా ఇంటికెళ్లిపోదాం.. తమ్ముడూ లేవరా అంటూ ఇద్దరి మృతదేహాలను పట్టుకుని విశాఖ కేజీహెచ్ వద్ద రోదిస్తున్న తీరు చూపరులను కంటతడిపెట్టించింది.. విశాఖ కేజీహెచ్ ప్రాంగణం బంధువుల రోధనలతో నిండిపోయింది. విశాఖ జిల్లా సింహాచలం సింహాద్రి అప్పన్న ఆలయం వద్ద గోడకూలిన దుర్ఘటనలో ఎనిమిది మంది మృతిచెందగా.. ఇద్దరు కోనసీమ జిల్లాకు చెందిన వారు ఉన్నారు. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన పత్తి దత్తుడు- వెంకటరమణ దంపతుల రెండో కుమారుడు పత్తి దుర్గాస్వామినాయుడు(28) వైజాగ్‌లో డైమండ్ ఇంటీరియర్స్ వర్క్ చేస్తున్నాడు.అదే గ్రామానికి చెందిన కుంపట్ల శ్రీనివాసరావు-సీతామహాలక్ష్మి దంపతుల ప్రథమ కుమారుడు మణికంఠ ఈశ్వరశేషారావు(శివ)(29) వైజాగ్‌లోని మెట్రో కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. వీరిద్దరిదీ ఒకే ఊరు.. స్నేహితులు కావడంతో ఎక్కడకు వెళ్లినా ఇద్దరూ కలిసే వెళతారు. మంగళవారం మధ్యాహ్నం ఇద్దరూ కలిసి అప్పన్న చందనోత్సవానికి వెళ్లారు.సింహాచలం ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉండ డంతో ప్రమాదవశాత్తూ ప్రహరీ కూలిన ఘటనలో ఈ ఇద్దరూ మృతిచెందారు. ఈ వార్త టీవీలోను, సామాజిక మధ్యమాల్లోను రావడంతో కుటుంబీకులు చూసి షాక్‌కు గురయ్యారు.చేతికందివచ్చిన కొడుకుల మృతివార్త తెలుసుకుని విషాదంలో మునిగిపోయారు. వెంటనే సింహాచలం బయలుదేరి వెళ్లారు. అనుకోని ఘటనతో ఇద్దరు యువకులు మృత్యువాత పడడంతో ఆ రెండు కుటుంబాలు కన్నీటిపర్యంతమయ్యారు.అందివచ్చిన కొడుకులు ఇకలేరని.. తిరిగిరారని తలచుకుంటూ రోధిస్తున్న తీరు అందరినీ కలచివేసింది. మృతులకు కేజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. బాధిత కుటుంబీకులను మంత్రులు వంగలపూడి అనిత, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు,గణబాబు, విష్ణుకుమార్‌రాజు, వంశీకృష్ణ శ్రీనివాస్ పరామర్శించారు. ఓదార్చారు.

జనసైనికుల మృతి బాధాకరం
డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

జనసైనికులు పత్తి దుర్గాస్వామినాయుడు, కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషారావు మృతి బాధాకరమని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని,జనసేన పార్టీ తరఫున ఎంతో అభిమానంగా పనిచేశారన్నారు. మృతుల కుటుంబాలకు జనసేన అండగా నిలుస్తుందన్నారు.

దైవ భక్తే..దూరం చేసింది..



'నా బిడ్డకు దైవభక్తి ఎక్కువ. తరచూ ఆలయాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుం టుంటాడు. వాడపల్లి వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ప్రతి వారం వచ్చేవాడు.. అంబాజీపేట వచ్చి అందరినీ పలికరించి వెళ్లేవాడు.. ఇప్పుడు ఆ భక్తే అతడిని మా నుంచి దూరం చేసింది' ఇంటీరియర్ డెకరేషన్‌లో ఎంతో పేరు తెచ్చుకున్నాడు. మా కుటుంబా నికి చేదోడు..వాదోడుగా ఉంటున్నాడు అంటూ పత్తి దుర్గా స్వామినాయుడు తండ్రి వీర వెంకట సత్యనారాయణ విలపించారు.

పత్తి వీర వెంకట సత్యనారాయణ (దుర్గాస్వామినాయుడు తండ్రి)

ఎలా వెళ్లిపోయావురా



మమ్మల్ని విడిచి ఎలా వెళ్లిపోయావు రా తమ్ముడు.నువ్వు ఇక లేడంటే అమ్మ, నాన్న నమ్మడం లేదు..ఏం చేయమంటావు రా అంటూ శేషారావు సోదరుడు లక్ష్మీనారాయణ కన్నీటి పర్యంతమయ్యాడు. కుటుంబమంటే తమ్ముడికి ఎంతో ఇష్టం..ఏడాదికాలంగా వైజాగ్ మెట్రో కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ కుటుంబానికి ఆస రాగా ఉంటున్నాడు. నాన్నకు చేదోడు వాదోడుగా ఉండేవాడు. వాడే మా కుటుంబానికి అండ..

- శేషారావు సోదరుడు లక్ష్మీనారాయణ



నాయకుడే కార్మికుడై..!

నాయకుడే శ్రామికుడై అన్నట్టుగా.. మంత్రి సుభాష్ రామచంద్రపురంలో జరిగిన మేడే ముందస్తు వేడుకల్లో ఇలా ఖాకీ దుస్తులు ధరించి.. ఎర్ర తువాలు మెడలో కార్మికుని ఆహార్యంతో కలిసి ప్రదర్శన నిర్వహించి ఆకట్టుకున్నారు..



మంత్రి దుర్గేష్‌కు పీఎంవో కార్యాలయ ఆదేశాల ప్రతులు అందజేస్తున్న సీఎం చంద్రబాబు



నేడు సీఎం చంద్రబాబు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న కల్వచర్ల ఏపీఐఐసీ భూములు

ఆరు!

సీఎం చంద్రబాబు కలలకు రూపం వచ్చింది.. ప్రతి అసెంబ్లీలో ఒక పారిశ్రామికవాడ ఉండాలన్న ఆయన ఆలోచలకు నేడు తొలి బీజం పడనుంది..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల్లో పిఠాపురం,జగ్గంపేట, రామచంద్రపురం, రాజమహేంద్రవరంరూరల్, కాకినాడరూరల్, పెద్దాపురంలో తొలి విడతగా పారిశ్రామిక పార్కులను తీర్చిదిద్దనున్నారు..ఈ మేరకు గురువారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు.



ఏపీఐఐసీ కార్యాలయం

ఆరు నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు

- ఉమ్మడి జిల్లాలో మరో అడుగు
- తొలి విడతగా ఆరు చోట్ల నిర్మాణం
- భూములకు ఏపీఐఐసీ ఆపసోపాలు
- అరకొరగా ప్రభుత్వ భూములు
- అయినా వీటివైపే మొగ్గు
- నేడు వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు తీయించడం కోసం ప్రభుత్వం చేస్తోన్న ప్రయత్నాలకు భూముల లభ్యత తలనొప్పిగా మారింది. ఒక్కో నియోజకవర్గంలో వందెకరాల్లో ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు ప్రయత్నిస్తుంటే ఎక్కడా ఏపీఐఐసీకి భూములే దొరకడం లేదు. రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపినా ఎక్కడా జాగా కనిపించడం లేదు. దీంతో అరకొరగానే ఉన్న స్థలాల్లో ఏదోలా పరిశ్రమలను ప్రోత్సహించడానికి నానాతంటాలు పడుతోంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆశించిన స్థాయిలో భూముల్లేని పరిస్థితి. ఉన్నంత వరకు భూములు చేతికి వచ్చిన ఆరు నియోజకవర్గాల్లో తొలి విడత పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు నిర్ణయిం చింది. సీఎం చంద్రబాబు నేడు(గురువారం) వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఐదు నియోజకవర్గాల్లో ప్రభుత్వం ప్లగ్‌అండ్‌ప్లే విధానంలో రూ.9.20 కోట్లతో భవనాలు నిర్మించి చిన్న కంపెనీలకు అద్దెకు ఇవ్వనుంది.

చంద్రన్న ఆదేశంతో కదలిక..

రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పారిశ్రామిక రంగం పూర్తిగా పడకేసింది. అప్పటి అధికార నేతల బెదిరింపులు, భూదాహంతో ఉన్న కంపెనీలు, రావాల్సిన కంపెనీలు రాకుండా పోయాయి. దీంతో యువతకు ఉద్యోగాలు లభించని పరిస్థితి. ఇదిలా ఉండగా ప్రభుత్వం మారాక సీఎం చంద్రబాబు పారిశ్రామిక రంగంపై ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గాల్లో సైతం చిన్న,మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించాలని నిర్ణయించారు. ప్రతి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భూముల లభ్యత బట్టి పది ఎకరాల నుంచి వంద ఎకరాల వరకు సిద్ధం చేయాలని ఏపీఐఐసీని ఆదేశించారు. వీటిలో ప్రభుత్వం ప్లాట్లు వేసి కంపెనీలకు కేటాయించడం, మరికొన్నింటిలో ప్రభుత్వమే భవనాలు నిర్మించి కంపెనీలకు ఇవ్వాలని నిర్ణయించారు.

ఆరు నెలలుగా భూజల్లెడ

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఏపీఐఐసీ అధికా రులు గడచిన ఆరునెలలుగా నియోజకవర్గాల్లో భూములను గుర్తించే పనిలో పడ్డారు. రెవెన్యూ అధికారులను సంప్రదించి ప్రభుత్వ భూములు ఇవ్వాలని కోరారు. కానీ ఎక్కడ చూసినా పెద్దగా ప్రభుత్వ భూములు లేని పరిస్థితి.అక్కడక్కడా ఉన్నా ఎకరం,రెండెకరాలకు మించి లేవు. దీంతో ఏంచేయాలో ఏపీఐఐసీకి తోచని పరిస్థితి. గత ప్రభుత్వ హయాంలో ఎక్కడికక్కడ ప్రభుత్వ భూముల కబ్జా, కొన్ని చోట్ల పూర్తిగా జగనన్న కాలనీలకు లాగేసుకోవడంతో ఎక్కడా భూములు లేవు. దీంతో ఏం చేయాలో తెలియక ఉన్న అరకొర భూములనే ఇవ్వాలని ఏపీఐఐసీ రెవె న్యూ అధికారులను కోరింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మొత్తం పారిశ్రామిక పార్కులకు 404 ఎకరాలే ఉన్నట్టు తేలింది. దీంతో ఏపీఐఐసీ తలపట్టుకుంటోంది. ఇంత తక్కువ భూమిలో పారిశ్రామికపార్కుల ఏర్పాటు ఎలాగో అర్థంకాక గింజుకుంటోంది. పోనీ ప్రైవేటుగా సేకరించాలంటే వందల కోట్ల లో ఖర్చు కానుంది. దీంతో పారిశ్రామిక పార్కు ల ఏర్పాటు కష్టతరంగా మారిన విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లింది.

తొలుత ఆరుచోట్లే...

కావాల్సినంత భూముల లభ్యత లేకపోవడం, అరకొర ఉన్న చోట ఇప్పటికీ ఆ భూములను రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి అప్పగించకపోవడంతో ఏపీఐఐసీ చేతులెత్తేసింది. దీంతో మే 1న నేడు సీఎం చంద్రబాబు ద్వారా వర్చువల్‌గా వీటికి శంకుస్థాపన చేసే అవకాశం లేకపోవడంతో వాటిని పక్కన పడేసింది. ప్రస్తుతం చేతికి భూములు వచ్చిన పిఠాపురం, జగ్గంపేట, రామచంద్రపురం,పెద్దాపురం, కాకినాడరూరల్,రాజమహేంద్రవరంరూరల్ నియోజకవర్గాల్లోనే తొలి విడత కింద పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ నిర్ణయించింది.వీటిలో రూ.9.20కోట్లతో చిన్న, మధ్యతరహా కంపెనీలకు ప్రభుత్వమే కార్యాలయాలు నిర్మించి అద్దెకు కేటాయించనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంలో వీటిని అన్ని సౌకర్యాలతో ప్రభుత్వం నిర్మించి కంపెనీలకు కేటాయిస్తుంది. నేరుగా కంపెనీలు ఇందులో ఏ ఇబ్బంది లేకుండా కార్యకలాపాలు ప్రారంభించవచ్చు.ఈ మేరకు నిధులు విడుదల చేయాలని కోరుతూ ప్రభుత్వానికి ఏపీఐఐసీ నివేదిక పంపింది. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గంలో భూముల్లేకపోవడంతో ఏపీఐఐసీకి కల్వచర్లలో సొంతంగా ఉన్న 104 ఎకరాల్లో ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించేలా త్వరలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుంది. ఈ లేఅవుట్‌కు సీఎం చంద్రబాబు నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారు.కాకినాడ రూరల్, పెద్దాపురంలోను భూముల్లేవు. ఉన్న కొద్దిపాటి ఏపీఐఐసీ భూముల్లో సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు.వీటికి కూడా సీఎం నేడు శంకుస్థాపన చేయనున్నారు. ఏపీఐఐసీ భూములు మినహాయిస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కేవలం పిఠాపురం, జగ్గంపేట, రామచంద్రపురం నియోజకవర్గాల్లోనే సీఎం ఇండస్ట్రియల్ పార్కుల ఏర్పాటుకు వర్చువల్ శంకుస్థాపన చేయనున్నారు. మిగిలిన నియోజకవర్గాల్లో ప్రభుత్వ భూముల లభ్యత అసలు లేకపోవడం, ఉన్న అరకొర విస్తీర్ణం ఎప్పటికి రెవెన్యూ అధికారులు ఏపీఐఐసీకి అప్పగిస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

పరిశ్రమలు ఇక్కడే..

- కాకినాడ జిల్లా పిఠాపురంలో 4.05 ఎకరాలు,కాకినాడరూరల్ వాకలపూడిలో ఏపీఐఐసీకి ఉన్న 2.99 ఎకరాలు, పెద్దాపురంలో 27 ఎకరాలను సిద్ధం చేస్తున్నారు. జగ్గంపేటలో 1.81 ఎకరాలు మాత్రమే గుర్తించారు. గండేపల్లిలో 3.39 ఎకరాలు, ప్రత్తిపాడు మండలం శంఖవరంలో 2.82 ఎకరాలు, తుని హంసవరంలో ఏడెకరాలు ప్రభుత్వ భూములు ఉన్నట్టు అధికా రులు తేల్చారు. కాకినాడ జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు 700 ఎకరాలు కాకపోయినా 400 ఎకరాలైనా ఉంటే చాలని అధికారులు భావిస్తే 49.06 ఎకరాలు గుర్తించారు.
- తూర్పుగోదావరి జిల్లాలో అనపర్తి నియోజకవర్గం రంగంపేటలో 8.90 ఎకరాలు గుర్తించారు.రాజమహేంద్రవరంలో సెంటూ కూడా లేదు.రాజానగరంలోని కోరుకొండలో 12.50 ఎకరాలు , రాజమహేంద్రవరం రూరల్ నిడిగట్లలో 12.50 ఎకరాలు ఉన్నట్టు గుర్తించారు. ఒక్క కొవ్వూరులోని తాళ్లపూడిలో 271 ఎకరాలు ఉన్నాయి. నిడదవోలులో సెంటు కూడా దొరకలేదు. గోపాలపురంలో 13.22 ఎకరాలు గుర్తించారు. తూర్పుగోదావరి జిల్లాలో 318 ఎకరాలు ఉన్నట్టు తేలింది.ఇందులో 80 శాతం భూములు కొవ్వూరులోనే ఉన్నాయి.
- కోనసీమ జిల్లాలో ముమ్మిడివరం, రాజోలు, గన్నవరం నియోజకవర్గాల్లో సెంటూ కూడా దొరకలేదు. రామచంద్రపు రంలోని ద్రాక్షారామలో 3.99 ఎకరాలు,అమ లాపురంలోని ఉప్పలగు ప్తంలో 6.83 ఎకరాలు, మండపేటలోని కేశ వరంలో 24.84 ఎకరాలు, కొత్తపేటలో 1.16 ఎక రాలు ఉన్నట్టు రెవెన్యూ అధికారులు ఏపీ ఐఐసీకి నివేదిక పంపారు. కోనసీమ జిల్లాలో మొత్తం 36.82ఎకరాలు ఉన్నట్టు తేల్చారు.

నేటినుంచి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

- జిల్లాకు రూ.116కోట్ల 64లక్షలు కేటాయింపు
- 5 నుంచి స్పౌజ్ కోటాలో కొత్త పింఛన్లకు అవకాశం


కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సర్వం సిద్ధమైంది. జిల్లాలో 2,70,558 మంది పింఛన్‌దారులకు రూ.116కోట్ల64 లక్షలు నిధులు విడుదల చేశారు. గురువారం ఉదయం 7గంటలనుంచి జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఈనెల 5 నుంచి స్పౌజ్ కోటాలో కొత్తవారికి పింఛన్లు పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది. 2023, డిసెంబరు నుంచి 2024, అక్టోబరు వరకు జిల్లాలో 3,935మంది పింఛన్‌దారులు మృతిచెందారు. భర్త మృతిచెందిన స్థానంలో భార్యకు స్పౌజ్ కోటాలో పింఛన్ ఇచ్చేందుకు అధికారులు కసరత్తుచేస్తుండగా దాదాపు ముగింపు దశకు వచ్చింది. దీనికి సంబంధించిన పత్రాలు అప్‌లోడ్ చేసి ప్రభుత్వానికి పంపారు. ఈ నేపథ్యంలో ఈ నెల 5న వీటికి సంబంధించిన మంజూరు ఉత్తర్వులు విడుదలయ్యే అవకాశం ఉందని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 5 నుంచి స్పౌజ్ కోటాలో 3935 మందికి కొత్తగా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. కొత్తగా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల కోసం వివిధ కేటగిరీల్లో ప్రతినెలా చాలామంది దరఖాస్తు చేస్తున్నారు. కానీ కొత్త పింఛన్లు మంజూరు కాలేదు. జూన్‌లోగానీ, జూలైలో గానీ కొత్తవారికి అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ప్రశాంతంగా ఏపీ పాలిసెట్ ప్రవేశ పరీక్ష

- జిల్లావ్యాప్తంగా హాజరైన 8,847మంది విద్యార్థులు
- 28 పరీక్షా కేంద్రాల్లో నిర్వహణ
- 92.56శాతం విద్యార్థులు హాజరు
- ఏపీ పాలిసెట్ కాకినాడ జిల్లా సమన్వయకర్త నల్లి జనార్దనరావు

కాకినాడ రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లాలోని 28 పరీక్షా కేంద్రాల్లో ఏపీ పాలిసెట్-2025 ప్రవేశపరీక్షను బుధవారం ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించినట్లు కాకినాడ జగన్నాథపురం ఆంధ్రాపాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్, ఏపీ పాలిసెట్ కాకినాడ జిల్లా సమన్వయకర్త డాక్టర్ నల్లి జనార్ధనరావు తెలిపారు. కాకినాడ జిల్లావ్యాప్తంగా నిర్వహించిన ఈపరీక్షకు మొత్తం 9,558మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 8847మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. 711మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరుకాగా 92.56శాతం హాజరు నమోదైంది. హాజరైనవారిలో 5212మంది బాలురు, 3635మంది బాలికలున్నారు. కాకినాడలోని 21 కేంద్రాల్లో 7,215మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 6,692మంది హాజరుకాగా 523 మంది పరీక్ష రాయలేదన్నారు. పిఠాపురంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో 2,343మంది ప్రవేశపరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 2,155 మంది హాజరుకాగా 188 మంది గైర్హాజరైనట్లు తెలిపారు. జిల్లాలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందన్నారు.

ప్రతిరోజూ 'స్పందనే'!



కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన జనం

జిల్లాలో ఎవరికి ఏ సమస్య వచ్చినా పరిష్కరించాల్సింది జిల్లా ఉన్నతాధికారి కలెక్టరే. అదే నమ్మకంతో జిల్లాకలెక్టర్‌కు నేరుగా అర్జీ అందజేసి సమస్యను పరిష్కరించుకోవాలని అందరూ ఆరాటపడుతుంటారు. కొందరు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ అర్జీలను జిల్లా ఉన్నతాధికారులకు అందిస్తే.. కొందరు మాత్రం నేరుగా కలెక్టర్‌కే తమ అర్జీ అందజేయాలనే ఉద్దేశంతో ఆయన కార్యాలయానికి తరలి వస్తున్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం ఒంటి గంటనుంచి రెండు గంటలవరకు విరామ సమయంలో గంటపాటు ఆయన్ను కలిసే అవకాశం ఇస్తుండడంతో ప్రతిరోజూ మధ్యాహ్నం అయ్యేసరికి కలెక్టర్ చాంబర్ సమీప ప్రాంతాలు ఇలా కిటకిటలాడుతున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కంటే.. ఇక్కడే కలెక్టర్‌కు తమ గోడు వినిపించుకునేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నవారు నేరుగా ఆయన చాంబర్‌వద్దకే వచ్చిఅర్జీలతో వేచిచూస్తున్నారు.

కాకినాడ-ఆంధ్రజ్యోతి

పరిశ్రమల ఏర్పాటుకు దరఖాస్తులు
త్వరితగతిన మంజూరు చేయాలి

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ),ఏప్రిల్30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఏకగవాక్ష విధంగా కింద ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లాలో పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఏకగవాక్ష విధానం కింద గడిచిన త్రైమాస కాలంలో అందిన దరఖాస్తులు పరిష్కారం, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహానికి వివిధ రాయితీల మంజూరు, పరిశ్రమలు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, గ్రౌండ్ వాటర్, ఏపీఐఐసీలపై సమీక్షించారు. కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ గత త్రైమాసికకాలంలో వివిధపరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ 196దరఖాస్తులు అందగా, 177 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశామన్నారు. 17దరఖాస్తులు వివిధ శాఖల వద్ద పరిశీలనలో ఉన్నాయన్నారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ప్రోత్సాహం కోసం పెట్టుబడి రాయితీ, పావల వడ్డీ, విద్యుత్, సేల్స్‌టాక్స్ వంటి రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన, సేవా రంగాల్లో 33 యూనిట్లకు రూ.90లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదించింది. ప్రధానంగా సూక్ష్మ, చిన్న పరిశ్రమల క్లస్టర్ అభివృద్ధి పథకం కింద ప్రతిపాదించిన క్లస్టర్ల ప్రతిపాదనను మే 15నాటికి సమర్పించాలన్నారు. ఏపీఐఐసీ ద్వారా పెద్దాపురం ఇండస్ట్రీయల్ పార్కులో ప్లాటెడ్ పరిశ్రమ కాంప్లెక్స్‌లో బ్లాక్ నిమిత్తం ఆసక్తిగల పారిశ్రామికవేత్తల నుంచి ప్రతిపాదనలు 5లోపు తీసుకోవాలన్నారు. పరిశ్రమలశాఖ జీఎం గణపతి, ఏడీ విజయ్ కుమార్, రవాణాశాఖా ధికారి శివారెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ధాన్యం అదనంగా కొనేలా చర్యలు తీసుకున్నాం: జేసీ

సామర్లకోట, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ఖరీఫ్ సీజన్ కన్నా ప్రస్తుత దాళ్వా సీజన్‌లో రైతులనుంచి ధాన్యం అదనంగా కొనుగోళ్లు జరిపేలా అన్ని చర్యలూ తీసుకున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా జేసీ రాహుల్‌మీనా స్పష్టం చేశారు. సామర్లకోటలో రైతులతో జేసీ మాట్లాడుతూ ప్రతి రైస్‌మిల్లుకు ఈ మేరకు ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రభుత్వం ధాన్యం మద్దతు ధరగా కామన్ రకానికి క్వింటాలుకు రూ.2,300, గ్రేడ్-ఏ రకానికి రూ.2,320గాను నిర్ధేశించినందున ప్రతి రైతు కొనుగోలు ప్రమాణాలను పరీక్షిస్తూ విక్రయాలు చేయాలన్నారు. ప్రతి రైతూ ధాన్యం విక్రయాలకు సంబంధించి 7337359375 నెంబరుకు వాట్సాప్ ద్వారా సమాచారాన్ని అందించిఎంచుకున్న సమయానికి ధాన్యం సరఫరా చేయవచ్చన్నారు. అనంతరం సివిల్ సప్లయ్ జిల్లా మేనేజరు దేవులు నాయక్ మాట్లాడుతూ ప్రతి రైతూ జీపీఎస్ ఫిక్స్ చేసిన వాహనాల ద్వారానే ధాన్యం రవాణా చేయాలన్నారు. బ్యాంకు గ్యారెంటీలు, మిల్లులో ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాలను పెంచుతామన్నారు. సామర్లకోట మండలంలోని వేట్లపాలెం ఆదిలక్ష్మి రైస్‌మిల్లు సందర్శించారు. ట్రాక్టర్ జీపీఎస్ ద్వారా ట్రాక్ చేయడం, కస్టోడియన్ అధికారి విధులు, వెహికల్ మానిటరింగ్ అంశాలు సరిచూసుకోవాలన్నారు. వేట్లపాలెం ఆర్‌ఎస్‌కే కేంద్రాన్ని సందర్శించారు.

సివిల్స్ ర్యాంకర్‌కు కలెక్టర్ అభినందన



విజేతను అభినందిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ పరీక్షల్లో 94వ ర్యాంకు సాధించిన పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా స్నేహిత్ కాకినాడ కలెక్టరేట్‌లో బుధవారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ షాన్‌మోహన్ ఆయన్ను అభినందించారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లకు డిప్యూటీ కలెక్టర్లు పయనం

కలెక్టరేట్(కాకినాడ), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో ఈ నెల 2న ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్ల పరిశీలనకు జిల్లానుంచి డిప్యూటీ కలెక్టర్లు పయనమై వెళ్లారు.దీనిలో కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జి.రత్నమణి, కాకినాడ ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్ ఏ.చంద్రమౌళీశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ డి.భారతి ఉన్నారు. విపత్తులశాఖ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జి.మమ్మి, బీసీ వెల్ఫేర్ ఈడీ శ్రీనివాసరావు, కేఎస్ఈజడ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామలక్ష్మి, సమగ్రశిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వేణుగోపాల్‌రావు కూడా వెళ్లారు. వీరితోపాటు డీఎస్‌వో సత్యనారాయణరాజు, ఏఎస్‌వో లక్ష్మీ ప్రసన్న, పౌరసరఫరాల శాఖలోని ఏడుగురు డీఎస్‌డీటీలు పయనమై వెళ్లారు.



జిల్లా క్రీడా మైదానంలో స్విమ్మింగ్ చేస్తూ...



ఫుట్‌బాల్ ఆడుతూ...

పరీక్షలు ముగిశాయి. వేసవి సెలవులు ఇచ్చేశారు. ఏడాది పొడవునా పుస్తకాలతో కుస్తీపట్టిన పిల్లలకు స్వాతంత్ర్యం లభించినట్లయింది. ఇప్పుడు పూర్తిగా ఇంటిపట్టునే ఉండడంతో వారు చేసే అల్లరి అంతాఇంతా కాదు. దీనికి పరిష్కారంగా చాలా మంది పెద్దలు సమ్మర్ క్యాంప్స్‌ను ఎంచుకుంటున్నారు.

ఒకే సమయంలో అటు ఆటలు, ఇటు విజ్ఞానాన్ని అందించే ఈ వేసవి శిబిరాలు ప్రస్తుతం పిల్లలను కూడావిపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ఇంతకు ముందులా వీరు సెలవుల్లో అమ్మమ్మ, తాతయ్య ఊర్లకు వెళ్లకుండా సమ్మర్ క్యాంప్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు.

ఆటాడుకుందాం... రా!

(కాకినాడ కార్పొరేషన్-ఆంధ్రజ్యోతి)

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఏదైనా కళలోను, క్రీడలోనో ప్రావీణ్యత ఉండడం అనే విషయాన్ని చదువుతో పాటు మరో అదనపు అర్హతగా గుర్తిస్తున్నారు. కాబట్టి చదువు ఒక్కటే సరిపోదని భావించడమే దీనికి కారణంగా చెప్పుకోవచ్చు. అందుకే వేసవి సెలవులను వృథాగా పోనీయకుండా ఓ కొత్త కళను నేర్చుకునేందుకు లేదా ఓ కొత్త పనిలో ప్రావీణ్యం సంపాదించేందుకు అటు పెద్దలు, ఇటు పిల్లలు ఉత్సాహం చూపిస్తున్నారు.

పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకోవాలి

తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని బయటపడే ఆటలను ఎంపిక చేసుకోవడం ముఖ్యం. ఎందుకంటే ఆస్తమా లాంటి సమస్యలు ఉండే చిన్నారులు స్విమ్మింగ్ చేయడం మంచిది కాదు. ఒక్కో చిన్నారి దేహదారుఢ్యం ఒక్కోలా ఉంటుంది. కాబట్టి టెన్నిస్ లాంటి ఇండివిడ్యువల్ స్పోర్ట్స్ లేదా బాస్కెట్ బాల్ లాంటి గ్రూప్ యాక్టివిటీస్‌లో చేర్పించడం ఉత్తమం.

పిల్లలు ప్రతి ఒక్కరిలోనూ సృజనాత్మకత దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి వెలికితీయడమే సమ్మర్ క్యాంప్‌ల ముఖ్య ఉద్దేశ్యం. సరదా కోసం మాత్రమే కాకుండా పిల్లలు ఆడుతూ, పాడుతూ ఎన్నో కొత్త విషయాలను ఈ వేసవి శిబిరాల్లో నేర్చుకుంటారు. ఇక్కడ నేర్చుకున్నవి భవిష్యత్తులో ఉపయోగపడడమే కాకుండా చిన్నారుల్లో జ్ఞాపకశక్తిని మరింతగా మెరుగుపరుస్తుంది.

ఇలాంటి శిబిరాల ద్వారా కొన్ని స్వప్రయోజనాలున్నాయి. సెలవుల కారణంగా తమ స్నేహితులను మిస్సయ్యామనుకునే పిల్లలకు ఈ శిబిరాల్లో ఇతర పిల్లలతో కలవడం ద్వారా ఆ ఫీలింగ్ దూరమవుతుంది. కొత్త స్నేహితులు ఏర్పడతారు. ఈ కేంద్రాల్లో ఉండే పలు రకాలైన క్రీడా పరికరాలతో పిల్లల ఆటపాటలకు ఏమాత్రం కొదువుండదు.

క్రీడా నైపుణ్యాలను మెరుగుపరచాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఏటా వేసవిలో ప్రత్యేక శిక్షణా శిబిరాలు నిర్వహిస్తోంది. విద్యార్థులకు ఆయా క్రీడాంశాల్లో ఆసక్తి పెంపొందించడంతో పాటు వారు రాణించేలా నెల రోజుల పాటు ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తోంది. అర్హత కలిగిన శిక్షకుల నుంచి ఇప్పటికే దరఖాస్తులు ఆహ్వానించి ఎంపిక చేసింది. కాకినాడ జిల్లావ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో శిక్షణ అందించేందుకు సమాయత్తమవుతోంది.



బాస్కెట్‌బాల్ సాధన చేస్తూ...

- పిల్లల మనోల్లాసానికి సమ్మర్ క్యాంప్స్
- మే 1 నుంచి 31 వరకు శిక్షణ
- కాకినాడ జిల్లావ్యాప్తంగా 24 క్రీడాంశాల్లో 50 శిబిరాలు
- 2,500 మంది చిన్నారులకు అవకాశం

ఈ ఏడాది కాకినాడ జిల్లాలో 24 క్రీడాంశాల్లో 50 కేంద్రాల్లో వేసవి శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఒక్కో క్యాంపులో 8 నుంచి 14 ఏళ్లలోపు గల 25 మంది బాలురు, 25 మంది బాలికలకు మాత్రమే శిక్షణ అందజేస్తారు. ఎంపిక చేసుకున్న క్రీడాంశంలో నెల పాటు ఉచిత శిక్షణ ఇస్తారు. బాక్సింగ్, బ్యాడ్మింటన్ వంటి ఇండోర్ క్రీడలతో పాటు హాకీ, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ వంటి అవుట్‌డోర్ క్రీడల్లో సైతం తర్ఫీదు ఇవ్వనున్నారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు శిక్షణ ఇస్తారు.



షటిల్ ప్రాక్టీస్...



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థకు సంబంధించి కాకినాడ, తుని, సామర్లకోట స్టేడియాల్లో నెల పాటు వివిధ క్రీడాంశాల్లో ఉచిత శిక్షణ ఇస్తాము. క్రీడా శిబిరాలను, శిక్షకులను ఎంపిక చేశాము. బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలి.

బి.శ్రీనివాస్‌కుమార్
జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, కాకినాడ



రాజమహేంద్రవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక లోకం లేకపోతే ప్రపంచంలో ఏ రంగమూ ముందుకు కదలదు. అయితే ఏళ్లకు ఏళ్లుగా వారి జీవితాల్లో మాత్రం వెలుగులు లేవు. తరాలు మారుతున్నా తలరాతలు మారట్లేదు. శ్రమనే నమ్ముకుని బతుకులను కష్టాలతో నెట్టుకొస్తున్నారు. పారిశుధ్యం, భవన నిర్మాణం, వ్యవ సాయం... ఇలా ఏ రంగంలోనూ కార్మికులు లేనిదే పని జరగదు. ఏదో ఒక రూపంలో కార్మిక శక్తి ఆయా రంగాల్లో చోదకశక్తిగా ఉంటోంది. కానీ వారి హక్కులు మాత్రం హననానికి గురవుతూనే ఉన్నాయి. ఒక ప్రభుత్వం మంచి చేయాలని సంకల్పిస్తే.. మరో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయ దురుద్దేశాలతో ముందు పాలకుల పథకాలను నిర్దాక్షిణ్యంగా నిలిపివేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అదే జరిగింది. గత నాలుగేళ్లుగా కార్మికులకు మేలు జరగ్గపోగా అప్పటికే వారికి అందుతున్న సంక్షేమ పథకాలను నిలిపేసింది. కార్మిక చట్టాలు, కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనం అమలు కోసం కార్మికులు యథావిధిగా ఎదురు చూస్తూనే ఉన్నారు. నేడు కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక లోకానికి లాల్ సలామ్ చెప్తూ.. ప్రత్యేక కథనం.

- తరాలు మారినా మారని కార్మికుల తలరాతలు
- దానికి తోడు వైసీపీ హయాంలో మొండిచెయ్యి
- పథకాలు, మండళ్లు రద్దు
- ప్రస్తుతం 'ఈ-శ్రమ్' ఒకటే దన్ను
- తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 6లక్షల మంది శ్రామికులు
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

● రాష్ట్ర వేడుకలు రద్దు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని 2019కి ముందు టీడీపీ ప్రభుత్వం వేడుకగా నిర్వహించేది. కార్మికులకు సత్కారాలు చేయడం, వారి సమస్యలపై దృష్టి పెట్టడం జరిగేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వేడుకలను నిలిపివేసింది. ఎవరైనా స్వచ్ఛందంగా కార్యక్రమాలు చేసుకుని అధికారులను ఆహ్వానిస్తే హాజరయ్యే పరిస్థితిని తీసుకొచ్చింది. దీంతో నాలుగేళ్లుగా కార్మిక దినోత్సవాన్ని కూడా నిర్వహించట్లేదు.

● అన్నీ నిలిపివేత

టీడీపీ ప్రభుత్వంలో అప్పటిదాకా అమలుచేసిన సంక్షేమ పథకాలను సైతం వైసీపీ ప్రభుత్వం రద్దు చేసేసింది. కొన్నిటిని హోల్డులో పెట్టింది. భవన నిర్మాణ, ఇతర కార్మికుల సంక్షేమ మండలిని కూడా నిర్వీర్యం చేసింది. అసంఘటిత రంగంలో- బతుకులకు ఏ కష్టం వచ్చినా భరోసా లేని భవన నిర్మాణ తదితర కార్మికులకు పూర్తిగా అన్యాయం జరిగింది. మరణించిన కార్మికుని కుటుంబాన్ని ఆదుకునేవారే కరువయ్యారు. 2019కి ముందు టీడీపీ ప్రభుత్వంలో కార్మిక మండళ్ల ద్వారా కార్మికుల పిల్లల వివాహాలు, చదువులకు చేయూత అందించేవారు. సహజ మరణానికి రూ.2-3లక్షలు, అంగవైకల్యానికి గురైతే రూ.లక్ష, ప్రమాదశాత్తు మృతి చెందితే రూ.5లక్షలు బాధితుల కుటుంబాలను ఎంతో కొంత ఆదుకునేవి. గత వైసీపీ ప్రభుత్వంలో వాటిని క్రమేపీ రద్దు వరకూ తీసుకొచ్చారు. చివరకు మహిళా కార్మికులకు ప్రసూతి సహాయం కింద ఇచ్చే రూ.50 వేలనూ నిలిపివేశారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఈ-శ్రమ్ కార్డులు మాత్రమే వారికి ప్రభుత్వాల తరఫున ఉన్న దన్నుగా కనిపిస్తున్నాయి. ఇక సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని కోర్టులు ఆదేశిస్తున్నా అమలు జరగట్లేదు. కనీస వేతనాల పరిస్థితీ అంతే. గ్యాస్ డెలివరీ బాయ్స్, పెట్రోలు బంకుల్లో పనిచేసేవారు.. తదితర కొన్ని రంగాల్లోని కార్మికులకు కనీసం వేతనాల మాట అటుంచితే అసలు జీతాల చెల్లింపే ఉండదు. వారికి వినియోగదారులు దయతలచి ఇచ్చే డబ్బులే జీవనోపాధి అనే నిజం కలచివేస్తోంది. చిన్న పని దొరికితే ఆ రోజు గడుస్తుందనే పరిస్థితుల్లో ఉన్న ఎంతోమంది భవన నిర్మాణ రంగ కార్మికులను రోజూ నగరాలు, మండల కేంద్రాల్లోని ఆయా ప్రదేశాల్లో చూడవచ్చు. కాంట్రాక్టు సంస్థలు/వ్యక్తులు కార్మికుల చెమట కష్టంలో సైతం కమీషన్ తీసుకుంటూ దోపిడీకి పాల్పడుతూనే ఉన్నారు.

● జిల్లాలో 6లక్షల మంది

తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో సుమారు 4లక్షల మంది అసంఘటిత, దాదాపు 2లక్షల మంది సంఘటిత రంగ కార్మికులు ఉన్నారు. కార్మిక శాఖ వారి సమస్యలకు చట్ట ప్రకారం పరిష్కారం చూపుతోంది. అసంఘటిత రంగ కార్మికుల్లో ఇప్పటికే 3.50 లక్షల మందికి ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేశారు. మిగతా వారికి పూర్తి చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహిస్తోంది.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

బీఎస్ఎం వలీ, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్, తూర్పు గోదావరి (ఇన్చార్జి అధికారి)

సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల వృత్తిపరమైన, ఇతర సమస్యలను తీర్చడానికి ఎప్పుడూ సిద్ధమే. కేసుల పెండింగుని 75 నుంచి 3కు తీసుకొచ్చాం. దీంతో కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు గట్టిగా కృషి చేస్తున్నాం. గత ఏడాదిలో 28 కేసులు నమోదు చేశాం. అసంఘటిత రంగ కార్మికులు, ప్లాట్‌ఫాం వర్కర్లు (యాప్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ఆధారంగా పని చేసేవారు) వెంటనే ఈ-శ్రమ్ కార్డు పొందాలి.

వైద్య ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ వైద్యకళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలో ఖాళీగా ఉన్న వైద్య ఉద్యోగాలభర్తీకి దరఖాస్తులు కోరుతున్నామని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ కంప్యూటర్ ప్రోగ్రామర్, ఫిజికల్ ఎడ్యుకేషనల్ ట్రైనర్ (పీఈటీ), ఎలక్ట్రికల్ హెల్పర్, మార్చురీ అటెండెంట్, ఆఫీస్ సబార్డినేట్, అనస్థీషియా టెక్నీషియన్, కార్డియాలజీ టెక్నీషియన్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, స్పీచ్ థెరపిస్ట్, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్, జనరల్ డ్యూటీ అటెండెంట్, స్టోర్ అటెండెంట్, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, చైల్డ్ సైకాలజీ, క్లినికల్ సైకాలజిస్ట్, ల్యాబ్ అటెండెంట్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. ఆసక్తి, అర్హత కల్గిన అభ్యర్థులు పూర్తి చేసిన తమ దరఖాస్తులను మే 1వ తేదీ నుంచి 12వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు ప్రభుత్వ వైద్యకళాశాల కార్యాలయంలో అందజేయాలని ఆమె పేర్కొన్నారు.

నేడు మేడే ర్యాలీ, బహిరంగ సభ

● సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ రాక

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని మే 1వ తేదీ గురువారం సీపీఐ, ఏఐటీయూసీ, రాజమండ్రి జట్టు లేబర్ యూనియన్, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్మికులతో ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఉదయం 9 గంటలకు రాజమండ్రి జట్టు లేబర్ యూనియన్ కార్యాలయం నుంచి కార్మిక ప్రదర్శన ప్రారంభమవుతుందని, షెల్టన్ హోటల్ సమీపంలోని ఆవ వాటర్ ట్యాంకుల వద్ద బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పాల్గొంటారని, కార్మికులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వాడపల్లి స్వామి, అమ్మవార్లకు నగలు బహూకరణ

● ఓ భక్తురాలి నిలువుదోపిడీ సమర్పణ

ఆత్రేయపురం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం విశాఖపట్టణానికి చెందిన శ్రీ వెంకటకృష్ణ అన్నమాచార్య సంస్థ అమ్మవారికి 46 గ్రాములతో రెండు మంగళసూత్రాలు, కేజీన్నర వెండి పళ్లెం స్వామివారికి సమర్పించారు. సంస్థ ప్రతినిధులకు స్వామివారి దర్శనం చేయించి వేదాశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందించారు.



స్వామి,అమ్మవార్లకు బంగారు సూత్రాలు, వెండికంచం బహూకరిస్తున్న దాతలు, నిలువుదోపిడీ సమర్పిస్తున్న భక్తురాలు

మొక్కు చెల్లించిన భక్తురాలు

కోరిన కోర్కెలు నెరవేరడంతో ఓ భక్తురాలు స్వామివారికి నిలువుదోపిడీ సమర్పించుకున్నారు. బుధవారం కుటుంబ సభ్యులతో ఆ భక్తురాలు స్వామివారిని దర్శించుకుని ఆమె ఒంటిమీద ఉన్న బంగారు వస్తువులను ముడుపు మూట కట్టి స్వామివారి హుండీలో సమర్పించుకున్నారు.

అఖిల భారత రోప్ స్కిప్పింగ్‌లో 'నన్నయ'కు ఓవరాల్ ఛాంపియన్‌షిప్



పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల రోప్ స్కిప్పింగ్ పురుషుల విభాగంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ క్రీడాకారులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. మహిళా విభాగంలో తృతీయ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించారన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలో క్రీడాకారులను వీసీ అభినందించి వివరాలు తెలిపారు. రాజస్థాన్‌లోని పింద్వారా మాధవ్ విశ్వవిద్యాలయంలో ఈనెల 22 నుంచి 24 వరకూ జరిగిన ఈ పోటీలలో నన్నయ అనుబంధ కళాశాల భీమవరంలోని డీఎన్ఆర్ కళాశాల విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ దక్కించుకున్నారన్నారు. అఖిలభారత రోప్ స్కిప్పింగ్ పురుషుల విభాగంలో ఐదు పతకాలు, మహిళా విభాగంలో నాలుగు పతకాలు సాధించారన్నారు. చక్కని ప్రతిభకనబరచిన ఆర్.యేసు బంగారు వెండి పతకాలు, కె.వేణుసాయి రెండు వెండి పతకాలు, ఎం.లీలాగణేష్ ఒక వెండి పతకం సాధించారన్నారు. మహిళా విభాగంలో జె.గాయత్రి, ఎం.నాగదేవి, సీహెచ్ సాయిలలిత, ఎస్ఆర్ గంగాభవానీలు ఒక్కొక్క బంగారు పతకం సాధించారని తెలిపారు. క్రీడాకారులను రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, కళాశాలల ప్రిన్సిపాల్స్, అధికారులు పాల్గొన్నారు.

మే 3 వరకూ బీఈడీ పరీక్షలు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలలో బీఈడీ మూడో సెమిస్టర్ పరీక్షలు ఈనెల 3వరకూ జరుగుతాయని ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయంలోని పరీక్షా కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈనెల 29 నుంచి ప్రారంభమైన ఈ పరీక్షలకు విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ప్రస్తుతం 169 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నారన్నారు.



పరీక్షాకేంద్రాన్ని పరిశీలించిన వీసీ ప్రసన్నశ్రీ

కేంద్ర న్యాయశాఖ మంత్రితో ఎంపీ సతీష్ బాబు భేటీ

కాకినాడసిటీ, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర చట్ట, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్వాల్‌తో బుధవారం ఢిల్లీలో రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో చట్ట, న్యాయవ్యవస్థకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అనేక అంశాలపై ఎంపీ చర్చించారు. ముఖ్యంగా కర్నూల్‌లో శాశ్వత హైకోర్టు బెంచ్ ఏర్పాటు, న్యాయస్థానాల్లో మౌలిక సదుపాయాలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల సంఖ్య పెంపు, న్యాయమూర్తుల ఖాళీలభర్తీ, విపత్తు ప్రాంతాలు, గిరిజన ప్రాంతాల్లో న్యాయస్థానాలు నిర్మాణం వంటి అంశాలపై చర్చించినట్లు ఎంపీ క్యాంపు కార్యాలయం నుంచి విడుదలచేసిన ప్రకటనలో వెల్లడించారు. అదేవిధంగా రాష్ట్ర పోలీస్‌శాఖ, న్యాయ వ్యవస్థ మధ్య సమన్వయం, కేసుల పరిష్కారంలో జాప్యం, కోర్టుల ఆధునీకరణ వంటి అంశాలను ఎంపీ సతీష్‌బాబు కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



కేంద్ర మంత్రి అర్జున్‌రామ్‌ను కలిసిన ఎంపీ సానా సతీష్‌బాబు

అక్షయ తృతీయ వేళ... బంగారు రంగులో భీమేశ్వరుడు



నూతన పట్టు వస్త్రంతో స్వామివారి అలంకరణ

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షయ తృతీయ సందర్భంగా కాకినాడజిల్లా సామర్లకోటలోని కుమార రామ భీమేశ్వర స్వామికి పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబాబు, రాజశేఖరశర్మ, అంజిబాబు, వెంకన్న అభిషేకాలు జరిపారు. బాలా త్రిపురసుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన చేశారు. స్వామిని బంగారు వర్ణంతో కూడిన పట్టు వస్త్రంతో సర్వాంగసుందరంగా అలంకరించారు. ఈవో బళ్ల నీలకంఠం ఏర్పాట్లను పర్యవేక్షించారు.

డీఆర్‌యూసీసీ మెంబర్‌గా అనిల్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారులు కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా కాకినాడ రెల్లిపేటకు చెందిన ముత్యాల అనిల్ నియమితులయ్యారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు సిఫార్సు మేరకు రైల్వేశాఖ అనిల్ నియామకాన్ని ధృవీకరిస్తూ నియామక పత్రం అందజేసింది. ఈ సందర్భంగా ఎంపీ క్యాంపు కార్యాలయంలో అనిల్‌ను బుధవారం మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని) సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీ క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి, జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు మేకా లక్ష్మణమూర్తి, బండి నరేంద్ర, సాయిబాబా, బర్ల శ్రీనివాస్, జోగా రాజు, దుర్గాప్రసాద్, శ్రీమన్నారాయణ, రెల్లి సంఘం నాయకులు సత్యం, బంగారు సత్తిబాబు, సోమాదుల గోవిందు, బండి లక్ష్మీనారాయణ, శ్రీవడ్డి పోలమాంబ రెల్లికుల పంచాయతీ సంఘం పెద్దలు పాల్గొన్నారు.



అనిల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మెరుపులు, ఉరుములొస్తే
పిడుగులే



ప్రజలను అప్రమత్తం చేస్తూ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచనలు

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో నల్లని మబ్బులు, మెరుపులు, ఉరుములు కనబడితే పిడుగులు పడే అవకాశం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ సూచిస్తోంది. అంతేకాదు ప్రతీ సెల్ ఫోన్‌కు పిడుగుల సమాచారాన్ని అందిస్తూ ప్రజలను కూడా అప్రమత్తం చేస్తున్నారు. పిడుగుపాటు సంకేతాలు, పిడుగులు పడే ప్రదేశాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయకూడని పనుల వివరా లను ప్రజలకు వివరిస్తూ ప్రాణనష్టం, ఆస్తినష్టం జరగకుండా ప్రజలను చైతన్యం చేస్తోంది. ప్రతీ ఏటా ఏప్రిల్ నెల నుంచి మే నెలాఖరు వరకూ సాయంత్రం పూట ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పిడుగులు పడి మనుషులు, జంతువులకు ప్రాణనష్టం జరిగే అవకాశముంది. దీనిపై పలు సూచనలు, జాగ్రత్తలను వివరిస్తున్నారు.

చేయకూడనివి

- ఆరుబయట ప్రదేశాల్లో ఉండకూడదు.
- ఆశ్రయం కోసం చెట్ల కిందకు వెళ్లకూడదు.
- నీటిలో ఉండకూడదు, లోహపు పైపుల నుంచి వచ్చే నీటిని తాకకూడదు.
- సెల్‌ఫోన్ ఉపయోగించరాదు, రేకుల షెడ్ల కింద, వరండాలలో ఉండరాదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు



- టీవీ, రేడియోల ద్వారా వాతావరణ సమాచారాన్ని తెలుసుకుని స్థానిక హెచ్చరికలు పాటించాలి.
- బహిరంగ ప్రదేశాల్లో ఉన్నపుడు మోకాళ్ల మధ్య తల వంటి చేతులతో చెవులను మూసు కుని భూమికి తగలకుండా వంగి కూర్చోవాలి.
- గోడలు, ద్వారాలు, కిటికీలకు దూరంగా ఉండాలి.
- ఎండిన చెట్లు, విరిగిన కొమ్మలకు దూరంగా ఉండాలి. వాహనాల్లో ప్రయాణించే వారు వాటిని సురక్షిత ప్రాంతాల్లో నిలిపి అందులోనే కూర్చోవాలి.
- పశుసంపదను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

పిడుగులు పడే ప్రదేశాలు

ఎత్తయిన ప్రదేశాలు, కొండప్రాంతాలు, పొడవైన చెట్లు, విద్యుత్, టెలీఫోన్ స్తంభాలు, టవర్‌లైన్లు, సెల్ ఫోన్ టవర్లు, విడివిడిగా ఉంటే ప్లాట్లు, ఇళ్లు, బహిరంగ ప్రదేశాల్లో పిడుగులు పడేందుకు ఆస్కారముంటుంది.

పిడుగుపాటుకు సంకేతాలు

ఆకాశంలో నల్లని మబ్బులు గుమికూడడం, మెరుపులు, ఉరుములు, వేగంగా గాలులు వీయడం వంటివి పిడుగుపాటుకు సంకేతాలుగా భావించాలి.



- ఉరుములు, మెరుపులు తదుపరి కనీసం 30 నిమిషాల వరకూ బయటకు వెళ్లరాదు. ఎలక్ట్రిక్ ఉపకరణాలు, వ్యవసాయ పంపుసెట్లు ఉపయోగించరాదు.
- ట్రాక్టర్లు, మోటారు సైకిళ్లను ఆరుబయట ఉంచరాదు.

క్రికెట్ టోర్నీకి వెళ్లొస్తూ తిరిగిరాని లోకాలకు..

ద్విచక్రవాహనాన్ని ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఇద్దరు మృతి

వీఆర్‌పురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని ట్రాలీ ఆటో ఢీకొనడంతో ఇద్దరు మృతిచెందిన ఘటన మండలంలోని శబరిరాయిగూడెం గ్రామ సమీపాన జరిగింది. వీఆర్‌పురం ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన ప్రకారం.. రామవరం పంచాయతీలోని శబరిరాయిగూడెం గ్రామానికి చెందిన మడకం నరేష్ (34), కొప్పల్లి గ్రామానికి చెందిన కారం చంద్రయ్య (30) వీఆర్‌పురంలో మంగళవారం జరిగిన క్రికెట్ టోర్నీకి వెళ్లారు. అనంతరం రాత్రి పది గంటలకు ద్విచక్రవాహనంపై స్వగ్రామం వస్తున్న క్రమంలో శబరిరాయిగూడెం సమీపంలో రేఖపల్లి గ్రామానికి చెందిన ట్రాలీ ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. తీవ్ర గాయాలైనవారిని స్థానికులు చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నరేష్ మృతిచెందాడు. కారం చంద్రయ్యను భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి 12గంటలకు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం మృతదేహాలను బంధువులకు అప్పగించామన్నారు.





నరేష్, చంద్రయ్య మృతదేహాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వీఆర్‌పురం ఎస్ఐ సంతోష్‌కుమార్

పాముకాటుకు మహిళ మృతి

ఇంటి లోపల ఇరుక్కున్న సర్పాన్ని గునపాలతో హతమార్చిన స్థానికులు

అంతర్వేది, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి గ్రామం బోను ప్రాంతం సమీపంలో మంగళవారం రాత్రి నాయుడు లక్ష్మిని పాము కాటు వేసింది. భయభ్రాంతులకు గురైన ఆమె కేకలు వేయగా స్థానికులు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఇంతలోనే ఆమె మరణించినట్టు వైద్యులు తెలిపారు. లక్ష్మి కుమారుడు అనారోగ్యంతో ఉండడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుడున్నాడు. సమయానికి కుమారుడు కూడా ఆసుపత్రిలో ఉండడంతో స్థానికులు తీసుకువెళ్లినా ప్రాణాలు దక్కలేదని బంధువులు తెలిపారు. బుధవారం ఉదయం లక్ష్మి ఇంట్లో స్థానికులు పొగ పెట్టి పాము కోసం వెతకగా పాము బయటకు వచ్చి మళ్లీ ఇంట్లోకి ప్రవేశించింది. స్థానికులు సాయంతో పామును వెతకసాగారు. మట్టి ఇంటిని తవ్వగా లోపల ఇరుక్కున్న పామును స్థానికులు గునపాలతో హతమార్చారు. రాజోలు ప్రభుత్వాసుపత్రిలో లక్ష్మి మృతదేహానికి పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



మరణించిన లక్ష్మి



స్థానికుల చేతిలో హతమైన పాము

గోదావరిలో దూకి వ్యక్తి గల్లంతు



వంతెనపై వదిలిపెట్టిన దుస్తులు

కొవ్వూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు రోడ్డు కం రైలు వంతెనపై నుంచి గోదావరి దూకి వ్యక్తి గల్లంతయ్యాడు. బుధవారం వంతెన 159వ స్తంభం వద్ద చొక్కా, లుంగీ వదిలిపెట్టి వ్యక్తి గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని స్థానికులకు పోలీసులకు సమాచారం అందించారు. దుస్తుల ఆధారంగా కొవ్వూరు పట్టణానికి చెందిన కోట్ల సత్యనారాయణ (78)గా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అర్ధరాత్రి వరకు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేయవలసి ఉంది.

ఇంట్లోకి ప్రవేశించి మహిళలు, పిల్లలపై దాడి

ముగ్గురు యువకులపై కేసు

కరప, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించి మహిళలు, పిల్లలపై దాడి చేసిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. కాకినాడ జిల్లా కరప మండలం అరట్లకట్టకు చెందిన మోకన బన్నీ, బోడా సతీష్, గుడుగుడు కాశీ గత నెల 27న రాత్రి అదే గ్రామానికి చెందిన మడిపల్లి రాజు ఇంట్లోకి దౌర్జన్యంగా ప్రవేశించారు. తమ మోటారు సైకిల్‌ను వారింట్లో దాచిపెట్టారనే ఉద్దేశంతో రాజు భార్య సత్య, వారి పిల్లలపై దాడి చేశారు. అడ్డుకోబోయిన రాజు మేనకోడలు గుబ్బల రోజారాణి, ఆమె తల్లిపై కూడా దాడి చేశారు. దీనిపై రోజారాణి బుధవారం కరప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సునీత పేర్కొన్నారు.

జాతీయస్థాయి ఎన్ఎస్ఎస్ సదస్సులో శ్యామ్‌కుమార్

జేఎన్టీయూకే, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్‌లో ఎన్ఎస్ఎస్ పాత్రపై గతనెల 25, 26తేదీల్లో న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి ఎన్ఎస్ఎస్ సదస్సులో కాకినాడ జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ గుబిలి శ్యామ్‌కుమార్ ఏపీ నుంచి హాజరైనట్టు పీఆర్వో రవీంద్రనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం వీసీ ఛాంబరులో ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ శ్యామ్‌కుమార్‌ను అభినందించారు. తనకు ఈ అవకాశం కల్పించిన హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ రీజనల్ డైరెక్టర్‌కు, ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌కు శ్యామ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

సింహాచలం ఘటన బాధాకరం : యనమల

తుని రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం ఘటన బాధాకరమని, గోడకూలి భక్తులు మృతిచెందడం తనను కలిసి వేసిందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మరణించిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రకృతి వైపరీత్యం వల్ల జరిగిన ప్రమాదంలో బాధితులు పట్ల దేశమంతా సానుభూతి చూపిస్తుంటే మాజీ సీఎం జగన్‌మాత్రం శవ రాజకీయం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వివాహ శుభలేఖలు ఇచ్చి తిరిగి వెళ్తుండగా విషాదం

డివైడర్‌ను ఢీకొన్న స్కూటీ

రామచంద్రాపురానికి చెందిన ఒకరి మృతి, మరొకరికి గాయాలు



ప్రమాద స్థలంలో వెంకటేష్ మృతదేహం

ఎలమంచిలి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కుమార్తె వివాహ శుభలేఖలు బంధువులకు ఇచ్చి ఇంటికి తిరిగి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎలమంచిలి మండలం మర్రిబంద జంక్షన్ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి వివరాలివి... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రాపురం రైస్‌పేటకు చెందిన నక్కా వెంకటేష్ (35), అనుపోజు బాబీ బావ బావమరుదులు. బాబీ కుమార్తెకు వచ్చే నెలలో వివాహం నిశ్చయం కావడంతో శుభలేఖలు విశాఖలోని బంధువులకు వచ్చి తిరిగి రామచంద్రాపురం స్కూటీపై వెళ్తుండగా మర్రిబంద సమీపంలో ప్రమాదవశాత్తూ రోడ్డు పక్కన డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే హైవే పెట్రోలింగ్ పోలీసులు, ఎన్‌హెచ్-5 సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే వెంకటేష్ మృతి చెందినట్టు గుర్తించారు. తీవ్రగాయాలైన బాబీని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. మృతుడు వెంకటేష్ బంగారం పని చేస్తుంటాడని, భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని ఎలమంచిలి ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాబీని అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

వయసు 20.. దొంగతనాలు 35

● తప్పించుకుని తిరుగుతూ పట్టుపడిన దొంగ ● ఐదు బైక్‌లు స్వాధీనం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 20 ఏళ్ల వయస్సులో 35 దొంగతనాలు చేసి తప్పించుకుని తిరుగుతున్న దొంగను తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం వన్‌టౌన్ పోలీసులు పట్టేశారు. విశాఖపట్నం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు ఇళ్ల దొంగతనాలు, బైక్ దొంగతనాల్లో ఆరితేరిన దొంగను పట్టేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డేగాపురానికి చెందిన జువ్వల కుమార్ రాజా అలియాస్ తరుణ్‌కుమార్, బేతా దుర్గాప్రసాద్, మామిడి దుర్గారావు ముగ్గురు కలిసి 2023లో విశాఖజిల్లా గోపాలపట్నంలో ఒక ఇంటి తాళాన్ని పగులగొట్టి దొంగతనం చేశారు అటుపై భీమవరం చిన్నఅమిరంలో బైక్, ఎన్టీఆర్ జిల్లా పటమటలో బైక్, రాజమహేంద్రవరం టూటౌన్‌లో రెండు బైక్‌లు, వీరవల్లిలో బైక్, ఉండిలో బైక్, బొమ్మూరు పరిధిలో బైక్‌ను తరుణ్, మారుబోయిన మావుళ్లు అనే దొంగతో కలిసి అపహరించుకుపోయారు. ఇందులో మావుళ్లను గత నెల 23న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామని టూటౌన్ పోలీసులు తెలిపారు. అయితే బుధవారం టూటౌన్ సీఐ పి.శివ గణేష్ ఆధ్వర్యంలో క్రైమ్ పార్టీ ప్రత్యేక నిఘాపెట్టి ఐదు బళ్ల మార్కెట్ సమీపంలో రైల్వే క్వార్టర్స్ వద్ద తరుణ్‌కుమార్‌ను పట్టుకున్నారు. నిందితుడి నుంచి ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకుని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. తరుణ్‌ను చాకచక్యంగా పట్టుకున్న సీఐ శివ గణేష్, హెచ్‌సీ ఎస్.రాజశేఖర్, క్రైమ్ కానిస్టేబుల్ ఎస్కే రబ్బాని, కానిస్టేబుల్స్‌ను తూర్పుగోదావరి ఎస్పీ నరసింహకిషోర్ ప్రత్యేకంగా అభినందించారు.



నిందితుడు, బైక్‌లతో పోలీసులు

రెడ్‌క్రాస్ జాతీయ కార్యవర్గ సమావేశానికి రామారావు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖకు చైర్మన్‌గా ఎన్నికై జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన వైడి రామారావు తన మొదటి సమావేశానికి హాజరుకావడానికి ఢిల్లీ వెళ్లారు. ఈ నెల 2న రెడ్‌క్రాస్ జాతీయ చైర్మన్ కేంద్ర ఆరోగ్య శాఖా మంత్రి జేపి నడ్డా అధ్యక్షతన సమావేశం జరుగుతుందని తెలిపారు.

ఈదురుగాలులకు 21 విద్యుత్ స్తంభాలు నేలమట్టం

కిర్లంపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మంగళవారం రాత్రి వీచిన ఈదురుగాలులు, భారీ వర్షానికి కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం రామచంద్రపురం గ్రామంలో సుమారు 20 విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. రామచంద్రపురం నుంచి కిర్లంపూడి మండలంలో సుమారు పది గ్రామాలకు విద్యుత్ సరఫరా వెళ్తుంది. దీంతో రామచంద్రపురం సర్పంచ్ తుమ్మలపల్లి సాయి గుణశేఖర్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి కిర్లంపూడి ఎలక్ట్రికల్ ఏఈ, జగ్గంపేట ఎలక్ట్రికల్ డీఈ, అధికారులతో మాట్లాడి బుధవారం ఉదయం 20 కొత్త విద్యుత్ స్తంభాలు రామచంద్రపురం గ్రామానికి తెప్పించారు. దగ్గరుండి స్తంభాల పనులు చేయించారు.



కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు దృశ్యం

ఆర్యవటంలో సింహాద్రి అప్పన్న చందనోత్సవం



చందన రూపుడై దర్శనమిస్తున్న స్వామివారు



చందనాన్ని నూరుతున్న దృశ్యం

కాజులూరు (కరప), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాజులూరు మండలం ఆర్యవటం శివారు చందాలవారిపేటలో బుధవారం శ్రీవరాహలక్ష్మీనరసింహ స్వామి (సింహాద్రి అప్పన్న) చందనోత్సవం ఘనంగా జరిగింది. తెల్లవారుజాము నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో స్వామివారికి సంకల్పం, విష్వక్సేనారాధన, చందనం తొలగించుట, పంచామృతస్నపనం, అర్చన, బాలభోగ నివేదన, మంగళహారతి క్రతువులను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి నిజరూప దర్శనం కల్పించగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించి తరించారు. సాయంత్రం నాలుగు గంటలకు చందన సమర్పణ చేసి స్వామివారి తిరు కల్యాణోత్సవం, పూర్ణాహుతి జరిపారు. అనంతరం నిర్వాహక కమిటీ సభ్యులు భక్తులకు తాగునీరు, అల్పాహారం, అన్నసమారాధన నిర్వహించారు.

రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు

బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు



కాకినాడలో జరిగిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వీర్రాజు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని, రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.15 వేలు కోట్ల ఆర్థిక గ్రాంట్ కూడా మంజూరు చేసిందని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. కాకినాడలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ విడిపోయిన ఏపీకి అత్యాధునికమైన రాజధాని నిర్మాణం చేసేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.18వేల కోట్ల నిధులు ఇచ్చిందని, ప్రస్తుతం రూ.15వేల కోట్ల ఆర్థిక గ్రాంట్ మంజూరు చేసిందన్నారు. ప్రధాని మోదీ మే 2న రాష్ట్రానికి వస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో ఏపీ ముందుకు వెళ్తుందన్నారు. రాష్ట్రంలో 11 నదుల ద్వారా రూ.50వేల కోట్లతో ఇంటింటికి మంచినీటి కుళాయి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చెట్లు నరికి తరలింపు

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట గోదావరి కాలువ లాకుల వద్ద రోడ్డుకిరువైపులా కాలువ గట్టు వద్ద ఉన్న భారీ చెట్లను గత రెండు రోజులుగా నిబంధనలకు విరుద్ధంగా నరికివేయించి అక్రమ అక్రమాలు చేశారని పలువురు రైతులు ఆరోపించారు. ఇరిగేషన్ అధికారులు గత ఏడిది వేసవి సీజన్లో సామర్లకోట బీటీయూటీ నుంచి ముత్యాలమ్మ విగ్రహం వరకూ కాలువ గట్టుపై ఉన్న పలు చెట్లను నరికి విక్రయించడంతో అప్పట్లో రైతులు సైతం ఫిర్యాదులు చేశారు. అదే రీతిలో ఈ ఏడాది కూడా భారీ చెట్లను నరికించేందుకు అటవీ శాఖ అధికారుల అనుమతులు పొందకుండానే అధునాతన యంత్రపరికరాలతో భారీ చెట్లను నరికివేశారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని సామర్లకోట తహశీల్దార్ చంద్రశేఖర రెడ్డికి బుధవారం రాత్రి రైతులు ఫిర్యాదు చేశారు.

వాటే సీన్‌లేరు



మోతుగూడెంలో బుధవారం ఉదయం సీలేరు నదిపై సూర్యోదయ సమయంలో కనువిందు చేసిన దృశ్యం (మోతుగూడెం, ఆంధ్రజ్యోతి)

అదిరే అరటిచెట్టు

కోనసీమ జిల్లా మలికిపురం మండలం గొల్లపాలెంలో మట్టా శ్రీనివాసరావు అనే రైతు పెరటిలో వేసిన అరటి చెట్టు వృక్షంలా ఎదిగింది. 24 అడుగుల ఎత్తుకు ఎదిగి ఆశ్చర్య పరుస్తుంది. సాధారణంగా అరటిచెట్లు 15 అడుగులు మించి ఎత్తు పెరగవు. ఈ అరటి విత్తనం పేరు బూడిద పక్కీస్ రకమని, విజయనగరంలోని స్నేహితుని ఇంటి నుంచి తీసుకువచ్చినట్టు శ్రీనివాసరావు తెలిపారు.

మలికిపురం (ఆంధ్రజ్యోతి)



ఏపీ త్రయంలో వాటర్ ట్యాంక్ ప్రారంభం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పెదపూడి మండలం ఏపీ త్రయంలో రూ.70వేల వ్యయంతో ఏర్పాటుచేసిన 5 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్‌ను అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ప్రారంభించారు. కూటమి మండల నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త తీయరు... పూడికలు తొలగించరు

పిఠాపురం కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల ఆగ్రహం

పిఠాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వీధుల్లో చెత్త తీయరు... డ్రైన్లల్లో పూడిక తొలగించరు... ఎన్నిసార్లు చెప్పినా, పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనం ఉండదు... పిఠాపురం కంపుకొడుతున్నా మీకు పట్టదా అంటూ కౌన్సిలర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఠాపురం పురపాలక సంఘ కార్యాలయంలో వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం బుధవారం వాడివేడిగా సాగింది. అధ్వాన పారిశుధ్యంపై పార్టీలకు అతీతంగా కౌన్సిలర్లందరూ అధికారుల తీరును ఎండగట్టారు. 25వ వార్డులో మురుగునీరు పోయే మార్గాలు లేక రోడ్లపై నీరు నిలిచిపోతోందని కౌన్సిలర్లు ముమ్మిడి రత్నసుజిత, పంపనబోయిన అన్నపూర్ణ తెలిపారు. లే అవుట్లు ఉండటంతో నీరుపోయే మార్గాలు మూసుకుపోయాయని, దీంతో ఆ ప్రాంతమంతా దుర్గంధపూరితంగా మారి ప్రజలు నివాసముండే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. పారిశుధ్య నిర్వహణను గాలికొదిలేశారని విమర్శించారు. కౌన్సిలర్లు చెప్పినా పారిశుధ్య నిర్వహణపై



అధ్వాన పారిశుధ్యంపై అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

అధికారుల్లో కదలిక లేదని కౌన్సిలర్లు తలిశెట్టి వెంకటేశ్వరరావు, రాయుడు శ్రీనుబాబు, పెదపాటి రాజేష్, బోను దేవ, బోనాసుల శివ తెలిపారు. అసలు పారిశుధ్య కార్మికులు పనిలోకి రాకుండా వారి తరపున ఇతరులను పనిలోకి పంపిస్తున్నారని, వచ్చినా పని చేయట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం చెత్త సేకరణ, సాయంత్రం కాలువల్లో పూడిక తొలగింపు పనులు చేపడతామని కమిషనరు కనకారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రభాకరావు ఇచ్చిన సమాధానంతో కౌన్సిలర్లు సంతృప్తి చెందలేదు. పట్టణంలోని ఇందిరానగర్, మాధవనగర్ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కౌన్సిలరు పెదపాటి నాగేశ్వరావు తెలిపారు. వీధి వ్యాపారస్తుల సంక్షేమం కోసం మార్కెట్లను అభివృద్ధి చేసే నిమిత్తం మెప్మా నిధులతో చేపట్టే పనుల టెండరును రద్దు చేశారు. జమ్మూ కశ్మీర్ ఉగ్రదాడి మృతులకు సమావేశంలో సభ్యులు సంతాపం తెలిపారు.

మరమ్మతులు చేయకుండా కొత్తవి కొంటారా

గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల మండిపాటు

గొల్లప్రోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): వేసిన వీధిలైట్లు నెల కాకుండానే ఆగిపోతుంటే వాటికి మరమ్మతులు చేయకుండా కొత్తవి కొనాలంటూ ప్రతి మూడు నెలలకు రూ.5లక్షలు వంతున పెట్టడం ఏమిటని కౌన్సిలర్లు నిలదీశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం సాయంత్రం చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్లు గుళ్ల సుబ్బారావు, గంటా అప్పలస్వామి మాట్లాడుతూ గతంలో లైటు ఒక్కటి రూ.600కి కొని ఇప్పుడు అంచనాల్లో రూ.1800 చూపించడం ఏమిటని, ఇందులో భారీగా గోల్‌మాల్ జరుగుతోందని ఆరోపించారు. వీధి లైట్లకు మరమ్మతులు చేయకుండా కొత్తవి కొంటే నగర పంచాయతీ నిధులను వృథా చేసినట్టే కదా అని ప్రశ్నించారు. దీనికి ఏఈ ప్రభాకర్ సమాధానమిస్తూ మరమ్మతుల నిర్వహణకు టెక్నీషియన్లు లేరన్నారు. కొత్త లైట్ల ఏర్పాటుకు ఆన్‌లైన్ టెండర్లు పిలవాలని కమిషనరు కనకారావు ఆదేశించారు. నాన్ లే-అవుట్లల్లో ఎందుకు బోర్డులు పెట్టడం లేదని అప్పలస్వామి నిలదీశారు. గతంలో గడపగడపకు నిధులతో ఇప్పటి దాకా 9వ వార్డులో ఒక్క పని కూడా జరగలేదని వైస్ చైర్‌పర్సన్ తెడ్లపు అలేఖ్యరాణి తెలిపారు. తనకు ఈ నిధులతో చేపట్టిన



అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

పనుల పూర్తి వివరాలు కావాలని లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చారు. శ్రీరామనవమి రోజున మాంసం విక్రయించిన దుకాణదారులపై ఏమి చర్యలు తీసుకున్నారని కౌన్సిలర్ మొగలి దుర్గానందరావు ప్రశ్నించారు. తక్షణం వాటిని మూసివేయించి చర్యలు తీసుకుంటామని కమిషనరు ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్మన్ గంధం నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక సామర్లకోట కౌన్సిల్ సమావేశం వాయిదా

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కోరం సభ్యులు హాజరు కాకపోవడంతో సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని గత్యంతరం లేని పరిస్థితిలో వాయిదా వేసినట్టు చైర్‌పర్సన్ జి.అరుణ ప్రకటించారు. బుధవారం సమావేశం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసి అధికారులు హాజరయ్యారు. 30 మందికి ఐదుగురు కౌన్సిలర్లు బలుసు శ్రీనివాసు, గొర్రెల జయలక్ష్మి, చల్లపల్లి శ్రీనివాసరావు, పిల్లాడి సత్యవతి, కాళ్ళ శ్యామల మాత్రమే హాజరయ్యారు. కొద్దిసేపు వేచి ఉన్నప్పటికీ ఎవరూ రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు.



సమావేశానికి హాజరైన ఐదుగురు కౌన్సిలర్లు

అనంతరం చైర్‌పర్సన్ అరుణ తన చాంబర్లో విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ ఇన్చార్జి దవులూరి దొరబాబు కౌన్సిలర్లను సమావేశానికి హాజరు కాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు.



ర్యాంకర్ లిఖిత, ఆమె తల్లిదండ్రులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

టెన్త్ ర్యాంకర్‌కు అభినందన

పిఠాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన పిఠాపురం భాష్యం స్కూలు విద్యార్థిని కొట్టేటి ప్రేమ సత్య లిఖితను మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అభినందించారు. తల్లిదండ్రులను సత్కరించారు. రాష్ట్రంలో పిఠాపురం ఖ్యాతిని ఇనుమడింపచేసిన లిఖితను, ఆమెకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. ప్రిన్సిపాల్ పోలుపర్తి వేణు తదితరులు పాల్గొన్నారు.



పుస్తక పఠనంపై అవగాహన కల్పిస్తున్న గ్రంథాలయ అధికారి నాగరాజు

‘పుస్తక పఠనంతో ఉన్నత శిఖరాలు’

పెద్దాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటే జీవితంలో ఉన్నత శిఖరానికి చేరుకోవచ్చని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా బుధవారం పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలను ఆయన వివరించారు. ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, గ్రంథాలయ సిబ్బంది సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు (కరప), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. గొల్లపాలెం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఆర్యవటం ఎస్ఎస్‌హెచ్క్యూ ఫీడర్ పరిధిలోని గొల్లపాలెం, ఆర్యవటం, బందనపూడి, మతుకుమిల్లి, తర్లంపూడి, చీకట్లవారిపేట, చేదువాడ, దేగలపేట, కరప మండలం కొంగోడు, గొర్రిపూడి గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

అమరావతి పునర్నిర్మాణంతో భావితరాలకు బంగారు భవిష్యత్తు

టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎంతో దూరదృష్టి కలిగిన సీఎం చంద్రబాబు ప్రత్యేక ప్రణాళికతో చేపడుతున్న అమరావతి రాజధాని పునర్నిర్మాణంతో భావితరాలకు బంగారు భవిష్యత్తు చేకూరుతుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ పేర్కొన్నారు. కాకినాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా పహల్గాంలో ఉగ్రవాదుల దాడిలో అశువులు బాసిన మృతులకు నివాళులర్పించారు. సింహాచలంలో గోడ కూలి భక్తులు మృతి చెందడంపై సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం నవీన్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయంలో విధ్వంసానికి గురైన అమరావతి రాజధాని అభివృద్ధిని తిరిగి పట్టాలు ఎక్కించేలా కూటమి ప్రభుత్వం 2.0కు శ్రీకారం చుట్టిందన్నారు.



రూ.65వేల కోట్లతో అమరావతి రూపుదిద్దుకుంటోందన్నారు. ప్రపంచంలోనే తొలి సోలార్ నగరంగా చరిత్ర సృష్టించనుందన్నారు. అమరావతి పునర్నిర్మాణానికి ప్రధాని మోడీ మే 2న శంకుస్థాపన చేస్తారని, ఇది రాష్ట్ర అభివృద్ధికి తిరుగులేని మలుపు అవుతుందని చెప్పారు.

అన్ని రైస్‌మిల్లులూ ధాన్యం కొనుగోలు చేయాలి

జేసీ రాహుల్‌మీనాకు రైతుల విన్నపం

సామర్లకోట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో తమను ఇబ్బందులకు గురిచేస్తుండడమే గాక ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని పలువురు రైతులు జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా, సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజరు నాయక్, వ్యవసాయ సహాయ సంచాలకురాలు రత్నప్రశాంతి ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. సామర్లకోట, ఇతర ప్రాంతాల్లో ధాన్యం కొనుగోలులో రైతుల ఇబ్బందులను తెలుగు రైతు కాకినాడ పార్లమెంటరీ చైర్మన్ పాలకుర్తి శ్రీనుబాబు, సామర్లకోట రైతు సంఘం అధ్యక్షుడు కంటే జగదీష్ మోహన్ (బాబు) పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దృష్టికి తీసుకెళ్లారు. బుధవారం ఆయన కలెక్టర్ షాన్‌మోహన్‌ను కలిసి రైతుల సమస్యలను విన్నవించారు. దీంతో కలెక్టర్ స్పందించి సత్వరం క్షేత్రస్థాయిలో లోపాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని జేసీని ఆదేశించారు. దీంతో బుధవారం సాయంత్రం ఆయా శాఖల అధికారులతో కలిసి జేసీ భీమేశ్వరాలయం ఎదురుగా మైదానంలో ఆరబోసిన ధాన్యం రాశులను పరిశీలించి రైతులు, రైతు నాయకులతో మాట్లాడారు. ధాన్యం విక్రయాలకు మిల్లర్ల ద్వారా ఎదుర్కొంటున్న సమస్యలను వారు ఏకరువు పెట్టారు. మండలంలోని అన్ని మిల్లులూ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేలా ఆదేశించాలన్నారు. మిల్లర్లు తమ లక్ష్యాలు పూర్తయ్యాయంటూ ధాన్యం కొనుగోలు చేయట్లేదని రైతు సంఘం అధ్యక్షుడు కంటే బాబు ఆరోపించారు. రోజు రోజుకూ మారుతున్న వాతావరణంతో ధాన్యాన్ని భద్రపరుచుకోలేక ఆర్థికంగా మరింత నష్టపోతున్నారని రైతులు జేసీ ఎదుట వాపోయారు. పర్యటనలో తహసీల్దారు కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి, మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, డిప్యూటీ తహసీల్దారు వై.శ్రీనివాసు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు పైండి శ్రీనువాసు, యార్లగడ్డ బాపినీడు, మలిరెడ్డి గాంధీ, బుడమయ్య పాల్గొన్నారు. జిల్లాలోని అన్ని పెద్ద మిల్లులు ధాన్యం కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చినట్టు ఎమ్మెల్యే చినరాజప్ప బుధవారం రాత్రి విలేకరులకు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



రైతుల సమస్యలను తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా



ఆక్సిజన్ కాన్సంట్రేటర్‌తో బాధితుడు ఆలీ

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అందజేత

కరప, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కరపకు చెందిన నర్ల సూరిబాబు (ఆలీ) ఊపిరితిత్తుల వ్యాధితో కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో ట్రీట్‌మెంట్ పొంది ఇటీవలే డిశ్చార్జ్ అయ్యాడు. అతడికి నిత్యం ఆక్సిజన్ కాన్సంట్రేటర్ అవసరమని వైద్యులు సూచించారు. ఆర్ఎంపీ బొబ్బిలి శ్రీను ద్వారా విషయం తెలుసుకున్న కరప మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు కాకినాడ రోటరీ క్లబ్ ప్రతినిధి అరిగెల వెంకటేశ్వరరావు (పెదబాబీ), పోలిశెట్టి ఈశ్వరరావులకు ఆలీ దుస్థితిని వివరించి సాయమందించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. వెంటనే వారు స్పందించి రూ.85వేలు విలువచేసే ఆక్సిజన్ కాన్సంట్రేటర్ సమకూర్చారు.

ప్రశాంతంగా పాలిసెట్ ప్రవేశ పరీక్ష

పిఠాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, ఏకేపీఎం ఉన్నత పాఠశాల, బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, శ్రీచైతన్య స్కూలు, గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరిగింది. అన్నిచోట్లా ప్రశాంతంగా సాగింది. మొత్తం ఏడు కేంద్రాల్లో 2,343 మంది విద్యార్థులకు 2,154 మంది హాజరయ్యారని అధికారులు తెలిపారు.

బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే

పిఠాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అన్నీ అనర్థాలే ఉంటాయని, పెళ్లి వయసు రాకుండా చేస్తే అది నేరమని, చట్టప్రకారం శిక్షార్హులు అవుతారని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. పట్టణంలోని పాదగయ క్షేత్రంలో బుధవారం బాల్య వివాహాల నియంత్రణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఆలయంలోని భక్తులతో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎన్‌కే దుర్గాదేవి, తహసీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీవో చిన్నారావు, పాదగయ ఈవో కాట్నం జగన్మోహన శ్రీనివాస్, డీసీపీయూ కౌన్సిలర్ దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి పళ్లంరాజు

‘దేశ ప్రజలను మతం పేరుతో విడగొట్టేందుకే ఉగ్రవాదుల దాడి’

కాకినాడ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజలను మతం పేరుతో విడగొట్టేందుకే ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారని కేంద్ర మాజీ మంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు మండిపడ్డారు. నగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందం అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పహల్గాంలో ఏం జరిగినా దాని వెనుక సమాజాన్ని విభజించి చిచ్చుపెట్టే కుట్ర దాగి ఉందన్నారు. జిల్లా అధికార ప్రతినిధిగా నియమితుడైన మారోతి శివగణేష్, కాకినాడ రూరల్ ఇన్‌చార్జిగా నియమితుడైన పిల్లి చిన్న, ప్రత్తిపాడు ఇన్‌చార్జిగా నియమితుడైన సత్యనారాయణలను సత్కరించారు. తొలుత పహల్గాం ఉగ్రవాదుల దాడి మృతులకు, సింహాచలం ఆలయంలో గోడ కూలిన మృతి చెందిన వారికి సంతాపం తెలిపారు.

సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి మల్లిపూడి రాంబాబు, కాంగ్రెస్ నగర కమిటీ అధ్యక్షుడు చెక్క నూకరాజు, పీసీసీ ప్రతినిధులు మట్టా ప్రసాద్, పోలిశెట్టి శ్రీనివాస్, నాయకులు బుర్రా పద్మనాభం, తాళ్లూరి రాజు, ఎన్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మెప్మా పీడీ ప్రియంవద

‘టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలి’

కార్పొరేషన్ (కాకినాడ), ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇచ్చిన టార్గెట్లను సకాలంలో పూర్తి చేయాలని సిబ్బందికి మెప్మా పీడీ ప్రియంవద సూచించారు. బుధవారం ఆమె నగరపాలక సంస్థకు చెందిన మెప్మా సిబ్బంది, రిసోర్స్‌పర్సన్లతో 2025-26 యాక్షన్ ప్లాన్‌పై సమీక్షించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సూర్య ఘర్‌కి సంబంధించి లబ్ధిదారులను త్వరితగిన గుర్తించాలన్నారు. మెప్మా సిటీ మిషన్ మేనేజరు డి.వెంకట్రాజు, జిల్లా స్పెషలిస్టులు రవిశంకర్, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న హెచ్ఎం వెంకటరమణ

ఉచిత సమ్మర్ క్యాంప్ ప్రారంభం

కరప, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నడకుదురు ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఉచిత సమ్మర్ క్యాంప్‌ను ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు సద్వినియోగంచేసుకోవాలని హెచ్ఎం వాకాడ వెంకటరమణ (చిన్న మాస్టార్) సూచించారు. పాఠశాలలో ఉచిత సమ్మర్ క్యాంప్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ఎంఈవోలు కొప్పుల బులిక్ష్మవేణి, పత్తి సత్యనారాయణ, ఉపాధ్యాయురాలు కె.విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రామలింగేశ్వరస్వామిని గంధంతో అలంకరించిన దృశ్యం

దుర్గాడ శివాలయంలో గంధోత్సవం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో బుధవారం గంధోత్సవం వైభవంగా జరిగింది. పంచాయతన సమేత ఉమారామలింగేశ్వరస్వామికి అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని గంధం, విష్ణునామాలు, ఉదకుంభాలు (నీటికుండలు)తో అలంకరించారు.



పుష్పాలంకారంలో అపర్ణాదేవి

అపర్ణాదేవికి విశేష పూజలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అపర్ణాదేవికి అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు ఆకొండి ప్రభాకరశాస్త్రి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, సహస్ర నామార్చన జరిపారు. కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నందీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నందీశ్వరుడి సంబరాలు ప్రారంభం

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం ఎదురుగా ఉన్న నందీశ్వరుని సంబరాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పురోహితుడు ద్విభాష్యం సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో మహా గణపతి పూజ, పుణ్యాహవాచనం, మంటపారాధన, అభిషేకం నిర్వహించారు. మూడు రోజులు ఉత్సవాలు జరుగుతాయని నందీశ్వర ఉత్సవ సేవా సమితి, గోపాలకృష్ణ ఆలయ సేవా సమితి సభ్యులు తెలిపారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఆర్యవైశ్య సంఘం నేత నానాజీ

మజ్జిగ పంపిణీ

గొల్లప్రోలు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అక్షర తృతీయ సందర్భంగా గొల్లప్రోలులో ఆర్యవైశ్య సంఘం నేత కేదారశెట్టి నానాజీ ఆధ్వర్యంలో బుధవారం మజ్జిగ పంపిణీ చేపట్టారు. 27 సంవత్సరాలుగా ఇదే రోజున మజ్జిగ పంపిణీ నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ ప్రతినిధులు కుసుమంచి పాపారావు, ఊర సుబ్బారావు, చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

సురేష్ కుటుంబానికి ఆర్థిక సాయం

పిఠాపురం రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం మల్లాంలో విద్యుత్ షాక్‌తో మరణించిన పల్లపు సురేష్ కుటుంబసభ్యులను మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ బుధవారం పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

జగ్గంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ రుణాలను ఆర్యవైశ్యుల్లో ఉన్న పేదలందరినీ అర్హులుగా గుర్తించి రుణాలు మంజూరు చేయాలని కోరారు. గడువులోగా యూనిట్లు గ్రౌండింగయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవితను రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు కోరారు. బుధవారం అమరావతిలో ఆయన మంత్రిని కలిసి విన్నవించారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక



దేవీపట్నంలో తడిసిపోయిన పంటలు

అకాల వర్షానికి తడిసిన పంటలు

దేవీపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి ఇందుకూరుపేట, శరభవరం, దేవారం, ఫజిల్లాబాద్, ఎం.రావిలంక, కొత్త వీధి ముసునగుంట, పోతవరం తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న పంటలు తడిసి ముద్దయ్యాయి. నాలుగు నెలల పాటు కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి అకాల వర్షానికి తడిచి ముద్దవ్వడంతో పండిన పంట పాడై నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పదిలో తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం తెలిపారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీలో పాస్ అయ్యేలా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ముసురుమిల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, డీఈవో వై.మల్లేశ్వరరావు, డీటీడబ్ల్యువో రామతులసి, కృష్ణమోహన్, మండల విద్యాశాఖాధికారులు ఎం.రామకృష్ణ, ఎం.సత్యనారాయణ, ముత్యాలరావు, బాపన్నదొర, వెంకటేశ్వరరావు, సూరారెడ్డి, తాతబ్బాయిదొర, ప్రిన్సిపాల్ ఎస్.కే.ఎలీషా, భాస్కరరావు, టి.బొజ్జయ్య, ప్రధానోపాధ్యాయులు బీఎస్ కుమార్, బి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏజెన్సీ డీఎస్సీకి ప్రత్యేక నోటిఫికేషన్ ప్రకటించాలి

రంపచోడవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ అభ్యర్థుల కోసం ప్రభుత్వం డీఎస్సీ ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని, అలాగే ఆదివాసీల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం చేపట్టే మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పల్లాల లచ్చిరెడ్డి, కుంజా దూలయ్య పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మార్క్స్-ఎంగెల్స్ భవనంలో శుక్రవారం బంద్ విజయవంతానికి సంఘీభావ సమావేశం నిర్వహించారు. ఏజెన్సీ డీఎస్సీ సాధన కమిటీ, అన్ని జేఏసీలు కలిసి ఐటీడీఏ ముట్టడి, ప్రదర్శన, రాస్తారోకో కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఐ.వి.రమణ, బలిజ చిన్నంరెడ్డి, పల్లాల లక్ష్మణ్ రెడ్డి, మడి ప్రసాద్‌దొర, మడకం జోగమ్మ, కత్తుల బాలురెడ్డి, అనసూయ, చిలకమ్మ, ఆదిరెడ్డి, రాంబాబు, రామారావు, అన్నిక పండయ్య, పి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

రహదారిపై పశువులతో ఇక్కట్లు



మోతుగూడెం యూనియన్ బ్యాంక్ రహదారి వద్ద అడ్డంగా ఉన్న పశువులు

మోతుగూడెం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో రాత్రి సమయంలో రోడ్లపై పశువులు సంచరించడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మోతుగూడెం యూనియన్ బ్యాంక్ ఏపీ జెన్కో భవ్య హెల్త్ హాస్పిటల్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయం, అపార్ట్‌మెంట్లు, గృహాలు, పలు ప్రాంతాల్లో రోడ్లపై పశువులు సంచరించడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మోతుగూడెం నుంచి భద్రాచలం, వైజాగ్, ఒడిస్సా వెళ్లే బస్సులు, ద్విచక్ర వాహనదారులు రాత్రి సమయంలో పశువులు రోడ్డుపై ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎనిమిది నెలల కిందట డొంకరాయి నుంచి ద్విచక్రవాహనదారులు భద్రాచలం వెళ్తుండగా మార్గమధ్యలో యూనియన్ బ్యాంక్ వద్ద రోడ్డుపై ఉన్న పశువులను ఢీకొన్నారు. దీంతో గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించారు. మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి జి.మోహన్‌ను వివరణ కోరగా పశువుల యజమానులకు నోటీసులు జారీ చేశామని, అయినా వారు పట్టించుకోలేదన్నారు. ఈసారి రోడ్లపై పశువు లను వదిలేస్తే గోశాలకు అప్పగిస్తామని హెచ్చరించారు.

విధులపట్ల చిత్తశుద్ధితో పనిచేస్తే గుర్తింపు

రంపచోడవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు విధుల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తే మంచి గుర్తింపు ఉంటుందని ఐటీడీఏ ఏపీవో(జీ) డీఎన్వీ రమణ అన్నారు. బుధవారం ఐటీడీఏ కార్యాలయంలో సబ్ ఆర్డినేటర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన వలల కృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్‌వో మార్తమ్మ, డిప్యూటీ తహశీల్దారు స్వామి, బీఎస్ కుమార్, బి.రాజు, సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నాగభూషణం, లక్ష్మీ, శ్రీకాంత్, రాజమణి, చెదల సోమిరెడ్డి, నరసింహారావు, శివ, జి.ఆనంద్, సబ్ అసిస్టెంట్లు నూకరాజు, నాగరాజు, శోభన్, శివ పాల్గొన్నారు.



కృష్ణారెడ్డి దంపతులను సత్కరిస్తున్న ఐటీడీఏ ఉద్యోగులు

గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గేదెల

దేవీపట్నం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): దేవీపట్నం ఆర్అండ్ఆర్ కాలనీ తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గేదెల పెద్ద సుబ్బారావు, ఉపాధ్యక్షుడిగా కరిబండి అయ్యప్ప, కార్యదర్శిగా అక్క బత్తుల శ్యామేలు రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడిగా మంగరౌతు రామకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వార్ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సిద్ద సత్యనారాయణ, లంక హరిచంద్రుడు, కరిబండి విష్ణు, గేదెల చిన్న సుబ్బారావు, గొడ్డ సింహాద్రి తదితరులు ఉన్నారు.



గ్రామ కమిటీని సత్కరిస్తున్న జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

రహదారులు జలమయం

» భారీ వర్షం.. ఈదురుగాలులు
» స్థంభించిన జన జీవనం
» నేలరాలిన మామిడికాయలు



కత్తిపూడి జాతీయ రహదారిపై పారుతున్న వర్షపునీరు



ధర్మవరంలో వర్షం కురుస్తున్న దృశ్యం



ప్రత్తిపాడులో మేఘావృత మైన ఆకాశం



తునిలో జలమయమైన రహదారి

ప్రత్తిపాడు/తుని రూరల్/తొండంగి/శంఖవరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పగలు ఎండ.. సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంగా గత మూడు రోజులుగా పలుచోట్ల భిన్న వాతావరణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వడగాల్పులతో భానుడు భగభగ మండడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. అయితే సాయంత్రం ఆకాశం మేఘావృతమై చల్ల గాలులతో కూడిన వర్షం పడడంతో ఉపశమనం పొందారు. ప్రత్తిపాడు, ధర్మవరం, ఒమ్మంగి, రాచపల్లి తదితర గ్రామాలతోపాటు తుని పట్టణ, గ్రామీణ ప్రాంతాలు, తొండంగి మండలంలో సాయంత్రం 6 గంటల నుంచి ఎడతెరిపిలేని వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గంట సమయం పాటు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో జన జీవనం స్థంభించింది. ఈదురుగాలులకు పలు మామిడి కాయలు నేలరాలి రైతులకు నష్టం వాటిల్లింది. శంఖవరం మండలంలో కొంతవరకూ వరికోతలు అయిపోయినా కళ్లాల్లో ధాన్యం ఉండిపోయిన రైతులు ఇబ్బందులు పడ్డారు. అరటి, మామిడి రైతలకు నష్టం వాటిల్లే ప్రమాదముందని ఉద్యానశాఖాధికారులు అన్నారు.

రహదారి పనులు వేగవంతం చేయాలి

ఏలేశ్వరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని జె.అన్నవరం రహదారి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) కార్మికులు నేతృత్వంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.

చింతకాయల పేటలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తొండంగి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరుమాళ్లపురం పంచాయతీ పరిధి చింతకాయల పేటలో ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని ట్రాన్స్‌ఫార్మర్ సమస్య పరిష్కారం అయినట్లు టీడీపీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు తెలిపారు. తుని నియోజకవర్గ ఎమ్మెల్యే యనమల దివ్య ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు

మాజీ మంత్రి పరామర్శ

తుని రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తుని మండలం డొండవాక పంచాయతీ శివారు సీహెచ్ అగ్రహారంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి, జిల్లా వైసీపీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి వెంట పలువురు వైసీపీ నాయకులు ఉన్నారు.

పారిశుధ్యం మెరుగునకు కృషి

మున్సిపల్ చైర్‌పర్సన్ భువన సుందరి



పారిశుధ్య సిబ్బందికి సూచనలిస్తున్న చైర్‌పర్సన్ సుందరి

తుని రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగునకు అధికార యంత్రాంగంతో పాటుగా పారిశుధ్య సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని తుని మున్సిపల్ చైర్‌పర్సన్ భువన సుందరి అన్నారు. బుధవారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. పారిశుధ్య మెరుగుకు సంబంధించి పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా ఎప్పటికప్పుడు వీధులన్నీ శుభ్రం చేయాలని చెప్పారు. ముఖ్యంగా కాలువల్లో పూడిక ఎక్కువగా ఉండడం వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి ఇబ్బందులు వస్తున్నాయని వాటిని సరిచేయాలని ఆదేశించారు. ఏవార్డులోను దోమల బెడదతో ప్రజలు ఇబ్బంది లు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ వెంకట్రావు, టీడీపీ నాయకుడు నార్ల రత్నాజీ తదితరులు పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

డీఎల్పీవో బాలామణి



లింగంపర్తిలో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న బాలామణి

ఏలేశ్వరం, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయం వస్తుందని పెద్దాపురం డీఎల్పీవో బాలామణి అన్నారు. బుధవారం మండలంలోని లింగంపర్తి పంచాయతీ పరిధిలోఉన్న సంపద తయారీ కేంద్రాని ఆమె సందర్శించారు. గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది తడి చెత్త, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి సంపద కేంద్రాలకు తరలించి ఎరువును తయారు చేయడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. ఎంపీడీవో సూర్యనారాయణ, అనపర్తి శ్రీనివాస్, సురేష్ పాల్గొన్నారు.

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే నెహ్రూ



సింహాద్రి అప్పన్న ఆలయంలో ఎమ్మెల్యే నెహ్రూ కుటుంబ సభ్యులు

జగ్గంపేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం సింహగిరిపై కొలువైన వరహాలక్ష్మీ నరసింహస్వామి నిజరూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. బుధవారం వేకువజామున ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తన కుటుంబంతో వెళ్లి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి వేద ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో నెహ్రూ సతీమణి మణిమ్మ, కోడలు లక్ష్మీదేవి, మనవడు అనీష్ నెహ్రూ పాల్గొన్నారు. అలాగే గోకవరం మండలం వెదురుపాకలో జరిగిన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ వెళ్లి స్వామివారి దర్శనం చేసుకున్నారు.

విశ్రాంత ఉద్యోగుల డీఏ బకాయిలు చెల్లించాలి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగుల డీఏ, పీఆర్సీ ఏరియర్స్ బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పెన్షనర్ల సంఘ మండలాధ్యక్షుడు ముక్కు సుబ్రహ్మణ్యం కోరారు. ప్రత్తిపాడు తోట వీధిలో బుధవారం జరిగిన మండల విశ్రాంత పెన్షనర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సీనియర్ సిటిజన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. మండల కార్యదర్శి ఏఎస్ఆర్ శేష గిరిరావు, వై.రామం, ఎం.రాజారావు ప్రసంగించగా పెన్షనర్లు అప్పారావు, జె.సుబ్బారావు, ఇ.సత్యనారాయణ, బి.సూరిబాబు పాల్గొన్నారు.



తునిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

ఉగ్రవాదం నశించాలి

తుని రూరల్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడిలో అశువులు బాసిన భారతీయుల ఆత్మకు శాంతి చేకూరాలి, ఉగ్రవాదం నశించాలంటూ తునిలో ర్యాలీ చేశారు. జాతీయ కాపు సంఘం రాష్ట్ర యువత జనరల్ సెక్రటరీ సూరపురెడ్డి శ్రీనివాస్ ర్యాలీకి పిలుపునివ్వగా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఏలేశ్వరం గ్రంథాలయంలో శ్రీశ్రీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఘనంగా శ్రీశ్రీ జయంతి

ఏలేశ్వరం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రంథాలయంలో కవికొండ సత్యనారాయణ నేతృత్వంలో బుధవారం శ్రీశ్రీ జయంతి నిర్వహించారు. శ్రీశ్రీ చిత్రపటానికి విద్యార్థులు పూలమాలలతో నివాళులర్పించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు తూరౌతు శ్రీనివాస్, మామిడి శ్రీను, తెలుగు పద్యాలు, సైన్స్ పరిజ్ఞానంపై తరగతులు నిర్వహించారు.

సంస్కృతి, సంప్రదాయాలను విస్తరింపజేయాలి

రాచపల్లి అరుణాచలేశ్వర దేవస్థానం ఫౌండర్ స్వామి రామానంద



ప్రసంగిస్తున్న స్వామి రామానంద

ప్రత్తిపాడు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచంలో విస్తరింపచేయాలని రాచపల్లి అరుణాచలేశ్వర దేవస్థానం ఫౌండర్, రమణాశ్రమ నిర్వాహకులు స్వామి రామానంద కోరారు. ప్రత్తిపాడులోని ముదునూరి మురళీరాజు గెస్ట్‌హౌస్ ప్రాంగణంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బాలల వికాస సమావేశానికి బాల వికాస కేంద్ర ప్రముఖుడు విశ్వనాథం అధ్యక్షత వహించారు. స్వామి రామానంద మాట్లాడుతూ నియమ నిబంధనలతో బాల్యం నుంచి విద్యార్థులు సాధన చేస్తే ఉన్నతశిఖరాలకు చేరుకోవచ్చన్నారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యుడు సింగిలిదేవ్ సత్తిరాజు, ఆర్ఎస్ఎస్ కుటుంబ ప్రబోధక్ పెమ్మరాజు రామచంద్రరావు, గోదావరి జోన్ ధర్మ ప్రచారక్ తోట జగన్నాథం, పడాల రఘు, ఎ.వరహాల బాబు, వి.వీర్రాజు, పేర్రాజు, పడాల రాంబాబు, తంగెళ్ల రాంబాబు, కట్టా బంగార్రాజు పాల్గొన్నారు.

నాణ్యతా లోపమే గోడ కూలడానికి కారణం

వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

తొండంగి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): చందనోత్సవం సందర్భంగా సింహాచలంలో గోడ కూలడానికి నాణ్యతా లోపమే కారణమని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా అన్నారు. ఈ విషయంపై బుధవారం ఆయన కొమ్మనాపల్లి గ్రామంలో మాట్లాడారు. వర్షాల కారణంగా గోడకూలినట్లు ప్రభుత్వం కుంటి సాకులు చెప్తోందని, జరిగిన సంఘటనకు ఏ శాఖ బాధ్యత వహిస్తుందని ప్రశ్నించారు. దీని కంతటికి ప్రభుత్వ అలసత్వమే కారణమన్నారు. దీనిపై ప్రభుత్వం ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. యనమల కృష్ణుడు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో ఇటువంటి సంఘటనలు పరిపాటిగా మారాయని సంఘటనకు కారకులైన వారిపై తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బత్తుల వీరబాబు, కోన సూర్యనారాయణ, గాబు రాజు, నాగం గంగబాబు, పేకేటి హరికృష్ణ, సాపిశెట్టి చిన్నా పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో నాణ్యత ఏదీ?

ఉప్పలపాడు గ్రామస్తులు, రైతుల ఆరోపణ



నాణ్యతలేని తారును చూపిస్తున్న ఉప్పలపాడు రైతులు

గండేపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో నాణ్యత లేదంటూ మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన పలువురు రైతులు, గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని ఉప్పలపాడు గ్రామం నుంచి రాజపూడి గ్రామం వరకు 7 కిలోమీటర్ల మేర రూ.4కోట్ల వ్యయంతో తారు రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లేదని స్థానికులు ఆరోపిస్తు న్నారు. ఇప్పటికే రోడ్డు నాణ్యతను పరిశీలించాలని ప్రజా వేదికలో కూడా ఫిర్యాదు చేశామన్నారు. రహదారి నిర్మాణంలో నాణ్యత పాటించలేదని ఉప్పలపాడుకు చెందిన రైతులు మేడబోయిన శ్రీను, సత్తి సోమరాజు, అంకం కృష్ణ, తోలేటి వెంకన్న రహదారికి ఉపయోగించిన నాణ్యతలేని తారును విలేకర్లకు చూపిస్తూ దీనిపై అధికారులు స్పందించి నాణ్యతను పరిశీలించాలని రోడ్డు దృఢంగా ఉండేలా చూడాలని కోరారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించాలి



వేలంకలో చెరువు పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

కిర్లంపూడి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మండుటెండలకు ఉపాధి పనులు వద్ద టెంట్‌లు, మజ్జిగ వంటివి ఏర్పాటు చేయాలని ఉపాధి కూలీలు డిమాండ్ చేశారు. వేలంక గ్రామం కొత్త చెరువులో బుధవారం కూలీలు ఉపాధి పనులు చేపట్టారు. ఏపీవో నాయుడు జేఈ కుమరి పనులను పరిశీలించారు. చెరువు పనులకు గాను 300 మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారని, టెంట్లు, మజ్జిగ వంటివి ఏర్పాటు చేయాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్ తంగెళ్ల సుబ్బారావు ఉన్నారు.

వైసీపీ బలోపేతానికి కృషి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడిగా నియమితులైన ముదునూరి మురళీ కృష్ణంరాజు చెప్పారు. ఆయన నియామకం పట్ల ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, అభిమానులు హర్షం తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

తొండంగి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పెరుమళ్ళపురం పంచాయతీ బుచ్చియ్యపేటలో ఎక్సైజ్ సిబ్బంది దాడి చేసి 1300 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు తుని ఇన్‌చార్జి ఎస్‌హెచ్‌వో శాస్త్రి తెలిపారు. దీనికి కారణమైన నిందితుడిపై పరారీ కేసు నమోదు చేశామన్నారు.

అపర్ణాదేవికి విశేష పూజలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తాటిపర్తిలో అపర్ణాదేవికి అక్షయ తృతీయ సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు కుంకుమ పూజలు, సహస్ర నామార్చన జరిపారు.